
చైతన్య లేఖలు



ఇవి

'చైతన్యలేఖలు'


అశాంతి తిమిరాలను అంతంచేసే
కాంతిరేఖలు.
వెలితిని, వేదనను రూపుమాపే
సుందరమైన చైతన్యవాక్కులు.
అవరోధాలను తొలగిస్తాయి.
అవగాహనను అందిస్తాయి.
సమస్యల పొరల్ని విప్పి,
సమస్యలోనే పరిష్కారాన్ని
చూపుతాయి. ఇవి లేఖలు.
ఒకరి కొరకు వ్రాసినవి కావు.
ఏ ఒక్కరిని వదలిపెట్టవు.
అందరి బాధలూ ఉన్నాయి
వాటిలో. అందరి సమస్యలూ
చర్చింపబడ్డాయి, ఆ లేఖలలో.
లేఖని చదివి పారేయడం
మన కలవాటు. ఇవి అలా పారేసే
ఉత్తరాలు కావు.
జారేసే ఉత్తరాలు కావు.
అలా అలా చదువుతుంటే,
ఇలా ఇలా కొత్త భావాలు
కదులుతుంటాయి.
అనుభవాలు కలుగుతుంటాయి.
పూజ్య స్వామీజీ శక్తివంతమైన
సుస్నితభావాలతో నిండిన
ఈ చైతన్యలేఖలు ముముక్షువులకు
కరదీపికల వంటివి.

చైతన్య లేఖలు



జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద



ఉత్తర పాత్తరాలు

తరాలు గడిచాయి. వాటితో పాటు ఈ ప్రపంచంలో ఎన్నో ఉత్తరాలు నడిచాయి. తలవ్రాతలను తుడిపేందుకు చేతివ్రాతలు ఉపకరిస్తే అంతకన్నా ఆనందదాయకమైనది మరొకటుండదు.

అందరికీ పనికొచ్చే వస్తువులను సంచిలో భద్రపరచుకొని గ్రామాంతరము వెళ్ళిన తండ్రి ఇంటికి తిరిగి వస్తాడు. ఇంటిలోని వారు సంచిని పరీక్షించి నాకేమి తెచ్చావని ప్రశ్నిస్తుంటారు. అందరికీ అందేవి మనకూ అందుతాయి. అలాగని మనస్సు సరిపెట్టుకోదు. కారణం? అందరి మనస్సులు ఒక్కటి కాకపోవడమే.

ఎవరి రుచులు వారివి. ఎవరి అభిరుచులు వారివి. అందుచేత ఎవరి సమస్యలు వారి కుంటాయి. ఇవి ప్రత్యేక పరిష్కారాన్ని కోరుతూ ఉంటాయి. అడిగితే ప్రశ్న లవుతాయి. చెబితే జవాబు లవుతాయి. ఈ ప్రశ్న జవాబుల పరంపరయే ఉత్తరాల తుంపరులు.

లేఖలు అనేక రీతులు. అప్పులడిగేవి కొన్నయితే ముప్పు తెచ్చేవి మరికొన్ని. క్షేమ మడిగేవి కొన్నయితే, క్షామమును తెలిపేవి ఇంక కొన్ని. కొన్ని సౌజన్యలేఖలు. మరికొన్ని దౌర్జన్యలేఖలు. మరి ఇవీ! **చైతన్యలేఖలు.** ఎన్ని గ్రంథాలు రచించినా, నాకేం చెబుతావు? అని అడిగేవారూ లేకపోలేదు. వారి కొరకు రచించినవియే లేఖలు. అడిగిందెవరైనా అందరము అడుగున యున్నవారమే. మడుగులో మునిగిన వారమే. సర్వుల సమస్యలు చర్చింపబడి యున్నందున ఈ లేఖలు సర్వులకూ ఉపకరిస్తాయి.

"నేను"ను పోగొట్టుకొనే ప్రయత్నంలో నేను సాగించిన నిర్వాకమిది. ఈ లేఖలు సాధకునికి ఎంతైనా ఉపయోగపడుతాయి.

కొన్ని లేఖలు చదివి ప్రక్కన పడేస్తాము. కొన్ని రెండు మూడు రోజులు ఉంచుకుంటాము. కొన్ని లేఖలను అప్పుడప్పుడు తీసి చదువుకుంటాము. మరి ఈ చైతన్యలేఖలు? ఎప్పుడూ చదువుకో వలసినవియే. తింటూ వుంటే మజా తెలుస్తుంది. చదువుతూ వుంటే నిజం ఎరుకపడుతుంది.

"It is by the benefit of letters that absent friends are, in a manner, brought together"

"దూరాలను తొలగించి, స్నేహాలను ఏకంచేసేవి లేఖలే" యని "సెనికా" అభిప్రాయపడటము జరిగింది.

దూరాలే నేడు భారాలై నిలిచి యున్నాయి. దూరాలు బయట లేవు. లోపల దూరిపోయి ఉన్నాయి. వాటిని దూరం చేసుకుంటే శాంతితీరాలు దగ్గరవులాయి.

ఇవిగో ఉత్తర పాత్తరాలు. విప్పండి. ఆ తరువాత ముడులన్నీ విడిపోతాయి.

చేతమును చిగురింపజేసే ప్రయత్నములో

చేవ్రాలు నందిస్తున్న

చైతన్యానంద

లేఖ ।

ప్రియాత్మా !

హరి: ఓం..... ఓం నమో నారాయణాయ

వందనములు.

ప్రపంచము ఒక ఎండమావి యని బాగుగా తెలుసుకొని ఆ తరువాత ప్రపంచములో నిర్భయముగా చరించు. జగత్తులోని సుందరదృశ్యము లన్నియూ మాయాస్వరూపములని మరచిపోకు. పరమాత్మను నీవు మరచినచో ప్రపంచమే నీకు పరమాత్మగా మిగులుతుంది. నీవు భక్తుడవై ప్రపంచాన్ని పూజిస్తుంటావు. సమస్త దుఃఖములకు ఈ పూజయే కారణమని మరువకు.

అనర్థదాయకమైన ఈ అనిత్య పూజతో అనేక జన్మలు వ్యర్థమైనాయి. నేడు నీకు జిజ్ఞాస కలిగింది. గురువు లభించాడు. ఇక దృష్టిని పరమాత్మవైపునకే మరలించు. జగత్పిత నీ తండ్రియైనచో నీకిక వెలితి ఎక్కడిది?

ఆధ్యాత్మికాభివృద్ధిని, ఆశించిన వారందరూ పొందలేరు. ఆశ ఒక్కటే చాలదు. అవకాశాలు కూడా రావాలి. అవకాశా లెప్పుడొస్తాయి? ఏమో?.....ఎవరికి తెలుసు? ఎలా చెప్పగలము? వాటి రాక తెలియదు గనుక వచ్చినప్పుడు మనము గుర్తించక పోవచ్చు కూడా. నీవు గుర్తించలేదని అవి ఆగుతాయా? వచ్చినట్లే వచ్చి వెళ్ళిపోతాయి. వెళ్ళినవి తిరిగి వస్తాయని చెప్పలేము. కనుక అవకాశాల కొరకు ఎదురుచూడటము గాకుండా అవకాశాలను మనము తయారు చేసుకోవాలి. వాటి చిరునామాను తెలుసుకోవాలి. వెళ్ళి తలుపు తట్టాలి. పిలుపునివ్వాలి. వలపు విప్పాలి. బ్రతుకును మలుపు త్రిప్పాలి.

ప్రాణతుల్యమైన మిత్రులు, బంధువులు వారి మనసు తెలిపిన కొన్ని కారణముల నాధారముగా జేసుకొని నీకు దూరమౌతుంటారు. అలాంటి సందర్భాలలో నీవు చాలా కృంగిపోతూ ఉంటావు. మనుషులు దూరమైనా దూరము కాలేని మమతలు నిన్ను చుట్టుముట్టి బాధిస్తూ ఉంటాయి. చూడు. ఇవి బాధపడవలసిన విషయములా? ఆలోచించు. ఈ ప్రపంచములోని మమతలన్నీ ఇలాగే కనుమరుగై పోతాయని ఎందుకు గ్రహించవు? భగవంతుని బాంధవ్యమే స్థిరమైనది యని ఎందుకు గుర్తించవు? గుర్తించి గ్రహించావా! అయితే గ్రహణం

వీడినట్లే. అగ్రహణము తొలగినట్లే. అన్యథాగ్రహణము అదృశ్యమైనట్లే. భగవానుని అనుగ్రహము ప్రాప్తించినట్లే. బోధలో బాధలు కనుమరుగైనట్లే.

ప్రయత్నశీలునకే అవరోధాలు అధికము. స్థిరచిత్తముతో ధీరుడవై మెలగుము. అవరోధము గోచరించినప్పుడు నీలో ఇంకా లోపాలు మిగిలున్నాయని తెలుసుకో. ఈ అవరోధాలకు అన్యులు తాత్కాలికంగా కారణములుగా తెలియవచ్చు. అంత మాత్రాన ఇతరులపై కోపగించకు. ఇతరులను నిందించకు. ఇది రెండవ అపరాధమై నిలుస్తుంది. నీ విధికి నీవే కర్తవు. నీ బాధలకు నీ మనస్సే కారణము.

ప్రశాంతముగా జీవించే సదలవాటును అలవరచుకో. సహనమును కలిగియుండు. పరిస్థితులు ప్రతికూలం కాగానే పలవరిస్తూ ప్రతిచర్యతో స్పందించకు. అవగాహనను పెంచుకో. వైరుధ్యములను విధాత నీ బ్రతుకులో ఎందుకు ప్రవేశ పెడుతున్నాడో ప్రశాంతముగా అవలోకించి అర్థం చేసుకో.

నీ బ్రతుకులో ఏదైనా జరుగవచ్చు. నీ మనస్సులో ఏమీ జరుగకుండా చూసుకో. పరిస్థితులు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. కానీ వాటితో పాటు నీ ప్రవర్తన మారకూడదు. నీ సాధన కుంటుపడకూడదు. ఎప్పుడూ అంతఃకరణ శుద్ధికొరకే కర్మలాచరించు. అశాంతి ఎదురైనపుడు వ్యథ చెందకుండా భగవానునికి సమర్పించు. పూర్ణహృదయంతో ధ్యానించు. అశాంతి అదృశ్యమై పూర్ణశాంతి మిగులుతుంది. నీ సుఖాన్ని అందరూ పంచుకొంటారు. నీ దుఃఖాన్ని భగవానుడే తొలగించగలడు.

"నేను" అనే అహంకారము మనలో అహర్నిశలు అవిశ్రాంతముగా పనిచేస్తున్నది. బాధలన్నీ దాని మాయలే. సమస్యలన్నీ అది చిత్రించినవియే. అహంకారము అనర్థదాయకము. అది అజ్ఞానమునకు అనుంగు బిడ్డ. అహంకారికి ఆత్మజ్ఞానము లభించదు. కాలిలోని ముల్లును తీసుకొనుటకు వంగియే తీరవలెను. తలవంచని వానికి బాధలు తొలగవు. అదియే నమ్రత. బ్రతుకులోని నాణ్యత.

ఆలోచించు. నడక సాగించు.

ముక్తిమార్గములో 'విరామ సమయాన'

వినీతుడు

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 2

ప్రియాత్మా !

హరిః ఓం.... ఓం నమో నారాయణాయ

వందనములు.

ప్రశస్తమైన మానవజన్మను పొంది, భగవంతుని పొందకుండా ఈ ప్రపంచం నుండి నిష్క్రమిస్తే ఎందుకు జన్మించినట్లు? ఎందుకు జీవించినట్లు? పాడుపడ్డ గృహమువలె నీకు, ఇతరులకు వినియోగపడకుండా బ్రతుకు అదృశ్య మగుటయేనా? మిడుత బ్రతుకు దీపము కొరకే నన్నట్లు మన బ్రతుకు శ్మశానానికేనా? ఆలోచించు. పొలములో విత్తనములను పంట కొరకే చల్లుతాము. మనము జీవించునది కూడా బ్రహ్మసాక్షాత్కారము కొరకే. ఇది మరవకు.

మరపే మనపాలిటి మరణమై యున్నది. ఆలయానికి వెళ్ళాలని ఇంటినుండి బయలుదేరుతావు. మార్గమధ్యంలో గోచరించే వింతదృశ్యాలను వీక్షిస్తూ నిలిచి పోతావు. నీవు వచ్చిన పనిని మరచిపోతావు. తీరా నీకు జ్ఞాపకమొచ్చి వెళ్ళేసరికి ఆలయ తలుపులు మూసివేశారు. ఇలాగే ఉంది మన సాధన అంతా.

వాంఛలనే గబ్బిలములు మనస్సును పట్టుకొని వ్రేలాడుతుంటే నీవు మందిరాలను దర్శించి ఏమి సాధిస్తావు. మనస్సును ప్రక్షాళనం చేసుకో. అహంకార పంజరములో కూర్చొని నీవు పలికే పలుకులు కంఠశోషయేనని మరవకు. సింహ కిశోరమువలె అహంకార పంజరమును ఛేదించుకొని బయటపడు. నీ పూర్ణ స్వరూపములో ప్రకాశించు.

రాతిబొమ్మలో చైతన్యమును దర్శించగలిగే నీవు ప్రాణిలో ప్రేమను నింపలేవా! ప్రతివ్యక్తిలో పరమాత్మను దర్శించే అలవాటును చేసుకోలేవా? ఏమిటీ! వారిలో లోపాలున్నవా? అవి వారి పాలిటి శాపాలు కావచ్చు. కానీ నీపాలిటి పాపాలు కాకూడదు. అంధకార బంధురమైన ఆకాశమును వెలుగులతో నింపుటకు ఆదిత్యుడు వెనుకాడుచున్నాడా? మురికినీటిని తనలో సంగమించవద్దని గంగానది అడ్డుపరచుచున్నదా? మిత్రమా! నా మాట విను. తృప్తి ప్రేమించడములో ఉంది. పలవరించడములో లేదు.

ప్రేమ ఒక గొప్ప ఆరాధన. దీనివలన సంకుచిత జీవనము మటుమాయ మౌతుంది. హృదయము విశాల మవుతుంది. సాధనలో అవరోధముల సంఖ్య బాగా తగ్గుతుంది. నీవు సాధకుడ వవుతావు.

సాధన ఆపిన క్షణాన కర్మయోగివి గా. ఆగిన సాధన మళ్ళీ తెలియకుండా ఆరంభమవుతుంది. ధ్యానము నీకేవిధమైన ప్రగతి నిస్తుందో కర్మ కూడా అలాంటి ప్రగతినే ఇస్తుంది. అహంకారమును త్యజించి, కర్మను కదిలించే స్థానమును మననం చేసుకొంటూ కర్మ నాచరించ గలిగితే ఆ కర్మ గొప్ప ధ్యానమౌతుంది.

బాధ్యతలను విస్మరించు వానిని భగవానుడు ఇష్టపడడు. "అంతా నీ భారమే నని పలికి కూర్చొనే సోమరి పరమాత్మకు దూరమే. "నాదేమీ లేదు" అని నిరంతరము శ్రమ తెలియక పరిశ్రమించువాడే పరమాత్మకు ప్రియుడు.

కర్మల నాచరించు. కానీ కర్మల కతీతమైన చైతన్యమే నీవనెడి భావనను సదా మనస్సులో కలిగియుండు. అప్పుడు కర్మలు బంధించవు సరిగదా కర్మల మధ్య నీవు భుజగశయనుడు శాంతాకారుడై యున్నట్లు ప్రశాంతంగా జీవించగలవు.

నీ కర్మలలో అవగాహన తొంగి చూడాలి. దివ్యప్రేమ పెల్లుబకాలి. పనుల మధ్య నీవు మునివై బ్రతకాలి. మాటల మధ్య నీవు మౌనం పాటించాలి. కర్మలతో కదులుతూ మనస్సును కదలకుండా నిలపాలి. సర్వకాల సర్వావస్థల యందు నీ హృదయములోని పరమాత్మతో ఐక్యమై యుండు. అప్పుడు నీలో పరమాత్మ సందడి పెరుగుతుంది. పని నీదైనా పనితనము అతనిదై ఉంటుంది.

నీలో నిలిచి, నీ పనిని మలచి, నిన్ను లోపలికి పిలిచి, నీలో కలిసి పోయేందుకు సిద్ధంగా యున్న పరంజ్యోతిని క్షణకాలము కూడా మరవకు. మహాత్ముల మహనీయ కార్యముల వెనుక నిలిచియున్న నిగూఢరహస్య మిదియే. నీవూ ప్రయత్నించు.

తల్లిగర్భంలో ప్రవేశించిన బిడ్డ తల్లికి ఎంత ప్రియమో గదా! పరమాత్మలో ప్రవేశించిన మనము ఆయనకు ప్రియము గాకుందుమా! ఇంకా ఆలోచిస్తున్నా వేమిటి? చిత్తము శివునిదైతే మనము ఆయనలో ఉన్నట్లేగదా! మరి కదలండి. కదలిక తెలియకుండా కలసిపొండి. ఆలోచించడము, ఆవలించడము మానేయి. అవలోకించడము అలవరచుకో.

మీ

స్వామి సుందరచైతన్యానంద

లేఖ 3

ప్రియత్మా!

హరిః ఓం..... ఓ. నమో నారాయణాయ

మాటలాడుట ఒక వరము లాంటిది. మధురముగా మాటలాడకపోవుట ఒక శాపమనే చెప్పాలి. పలుకు అందరికీ లభ్యం .... తియ్యగా పలుక గలుగుట కొందరికే సాధ్యం.

సాధకుడు సంభాషణలో సావధానచిత్తుడై ఉండాలి. మాట్లాడే ముందు ఆ మాట అవసరమైనదో కాదో రెండుసార్లు ఆలోచించి మరీ మాట్లాడాలి. అవసరమని తేలితే అప్పుడు మాట్లాడాలి. అదికూడా అందముగా పలుకగలగాలి. ఎక్కువ విషయాన్ని తక్కువ మాటలలో నింపగలగాలి. చెప్పే విషయము సూటిగా యుండాలి. పలుకు ధైర్యంగా యుండాలి. ఈ ధైర్యం వెనుక అహంకారము చోటు చేసుకోకూడదు. ఆత్మస్థైర్యం నిండియుండాలి.

మనమాట వినేవ్యక్తి యొక్క మనస్సును కదిలించ గలగాలి. ఇతరులు ఆలోచించేటందులకు అనుగుణంగా భావస్ఫూర్తిలో పలకాలి. మాటను బయటకు పంపేముందు మనస్సును ఒక క్షణం లోనికి మరల్చాలి. పంచదారతో కలిపిన పిండి తియ్యగా మారునట్లు మాధవుని స్పృశించిన మనస్సు మధురభాషణము చేయగలదు.

ఇతరులను బాధించే మాటలు మాటలాడకు. ఇది చెప్పినంతగ సులభమైన పని కాదు. ఎదుటి వ్యక్తిలో పరమాత్మను దర్శించినపుడే అది నీకు సాధ్యమవుతుంది. కనుక ఎవరిని నీవు సమీపించినను మొదట వారిలో పరమాత్మను దర్శించి ఆ తరువాత భాషించడము అలవరచుకో. ఇదియే మధురజీవనము

విమర్శించుట నీ పని కాదు. నీవు సాధకుడవు. విమర్శలో విషమత్వ ముందని మరచిపోకు. ఇతరులలో దోషదర్శనము చేయకు. దోషులపై నీ కుండవలసింది సానుభూతియే గాని ద్వేషము కాదు. రోగిపై వైద్యునికి ద్వేషముండునా? మంచివానికి చెడ్డవానిపై ద్వేషమెలా కలుగుతుంది? సరళ స్వభావము కలిగియుండు. ఇతరుల భావాలకు నీవు బానిసవు గాకు. అలాగే నీ భావాలకు ఇతరులను బానిసలు చేయకు.

కులప్రసక్తి అనుకూలమైనది కాదు. "నీ కులమేమిటి?" అని ఎవ్వరినీ ప్రశ్నించకు. మాట్లాడు సందర్భాలలో "అర్థమైనదా! అర్థమైనదా!" అనెడి అనుచిత వచనమును పలుకకు. అర్థమయ్యేలా ఎలా చెప్పాలో నీవే ఆలోచించుకో.

ఇతరులు నీ మాటను గౌరవించలేదని వ్యథ చెందకు. అంగీకరించలేదని అలమటించకు. బట్టల వ్యాపారి కొనుగోలుదారునకు తనవద్దనున్న వస్త్రములన్నీ చూపుతాడు. అన్నిటినీ చూసి వచ్చిన వ్యక్తి నచ్చలేదని వెళ్తాడు. అంతమాత్రాన వ్యాపారి వ్యథ చెందడు. మరొకరు గ్రహిస్తారనే విశ్వాసముతో ఎదురు చూస్తుంటాడు. నీ దగ్గర మంచి ఉంది. అవసరమున్న వ్యక్తి అందుకుంటాడు. ఈ విషయములో ఆవేదనకు తావు ఎక్కడ?

నీవు మాటలలో ఇతరులను గాయపరచక పోవచ్చు. కానీ ఇతరుల వచనములు కూడా నిన్ను గాయపరచకుండా చూసుకోవాలి. మనస్సును ఎవ్వరూ గాయపరచలేరు. బాహ్యంలోని వ్యక్తులు ఆంతర్యంలోని మనస్సును ఎలా గాయ పరచగలరు? మనస్సుకు ఏర్పడే గాయము ఇతరులు చేసేది కాదు. మనము చూపేది.

నిన్ను చెడ్డవాడని ఇతరులు పలికినపుడు నీ మనస్సు గాయపడుతుంది. అయితే వారు పలికే చెడ్డ నీలో ఉన్నదా? బాగా ఆలోచించుకో. ఉన్నదా? అయితే గాయపడుట ఎందులకు? సరిజేసుకో. సరిపోతుంది. ఒకవేళ నీలో దోషము లేదను కుందాం. అలాంటప్పుడు నీవు బాధపడవలసిన అవసరమేమున్నది? లేనిదానికి లేమి ఎక్కడ? నవ్వి ఊరుకో.

"నా మనస్సు గాయపడక పోవచ్చు. కానీ నాలో లేని దోషమును ఇతరులు ప్రస్తావించుట వలన సమాజములో నా విలువ తరిగిపోదా?" అనెడి సందేహము నీకు రావచ్చును. పిచ్చివాడా! సమాజము యొక్క గుర్తింపు నీకు కావాలా? అయితే నీవు ఎప్పుడూ సాధకుడవు కాలేవు. వ్యక్తుల సముదాయమే సమాజము. మనస్సు గలవాడు మనిషి. మారిపోయే స్వభావము కలదియే మనస్సు. చెదిరే మనస్సులతో కదిలే మనుష్యులు నిన్ను గుర్తించాలా? గుర్తిస్తారా? పిచ్చివాడా? నిన్ను చూసే చూపు దివ్యంగా వెలుగుతున్నది. నీవు చూడవలసిన రూపు అపురూపంగా నిలిచియున్నది. నిలిచే దేమిటో, నీరసించి నశించే దేమిటో తెలిసి మరీ చరించు.

గాలి తీవ్రంగా వీస్తున్నను లాంతరు ఆరిపోకుండా వెలుగు నందించునట్లు సమాజములో ఎదురయ్యే ప్రతికూల పవనాలు తీవ్రంగా వీస్తున్నను అచంచల విశ్వాసముతో వెలిగిపోయే స్థితిని సంపాదించుకో. ఇదియే వెలితి తెలియని వెలుగు. ఇక సెలవు.

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 4

ప్రియాత్మా!

హరిః ఓం...... ఓం నమో నారాయణాయ

విరామ మెరుగని నీ జీవితము, విశ్రాంతి నివ్వని నీ పనులు ఆధ్యాత్మిక సాధనకు అంతరాయములని భావించకు. ఎదురయ్యే బాధలను ప్రగతి నిరోధక శక్తులుగా తలచకు. బాధలే బ్రతుకును బాగుచేసే బోధలని గుర్తుంచుకో. బాధా నివృత్తి గాక బాధల మధ్య ఆనందముగా జీవించే సదలవాటును కలిగియుండు. బాధలుండినా ఫరవాలేదు. బాధ, యనెడి భావన లేకపోతే చాలు.

గృహంలో తల్లిని చూడు. ఆమె జీవితములో ఎంత త్యాగమున్నది? ఎంతటి సేవాభావ మున్నది? తన అవసరాలను మరచి, పరులకొరకు ఆనందముగా శ్రమించుటలోనే ఆమె తృప్తి చెందుతుంది. భర్తకు సేవ చేస్తుంది. బిడ్డలను తృప్తి పరుస్తుంది. అతిథులను ఆదరిస్తుంది. ఆ తరువాత మిగిలిన కాలంతో, కబళంతో ఆమె తృప్తి చెందుతుంది. భర్తకు సమస్యలొస్తే ఆమెకు నిద్రపట్టదు. బిడ్డలకు అస్వస్థత కలిగితే ఆమెకు విశ్రాంతి మిగలదు. అతిథులు అరుదెంచగనే ఆమె తనను తాను మరచి నిర్విరామంగా శ్రమిస్తుంది. సేవలోనే సంతృప్తిని పొందుతుంది. ఈవిధమైన దృక్పథమును నీవూ అలవరచుకోవాలి. తల్లిలోని సేవాజీవన దృక్పథము నీలో లేనిది కాదు. అది నీ స్వభావమేనని మరచిపోకు. దీనిని నిత్యజీవితములో దర్శించి తరించే అలవాటును చేసుకోవాలి. అభ్యాసమే ఇక్కడ అవసరము.

శాంతికొరకు అటూ ఇటూ తిరగకు. ఉన్నచోటనే ఉండు. నిస్పృహ తెలియని నిరంతర సేవాజీవనములో సర్వమూ సిద్ధిస్తుంది. ఆటంకములు అదృశ్యమౌతాయి. ఆవేదనలు తీరిపోతాయి.

బాధలన్నీ మనస్సులోనే ఉన్నాయి. సేవాజీవనము ద్వారా, ఈశ్వరచింతనము ద్వారా మనస్సును అధిగమించు. చాలు. ఆ తరువాత ప్రతి గృహము నీకు ఆలయములా గోచరిస్తుంది. ప్రతివ్యక్తీ నీకు కృష్ణుడుగానే తెలుస్తాడు. ప్రతి అణువూ శాంతికి నిలయంగాను, ప్రతి బాధ నిజమైన బోధగాను తెలుస్తాయి.

ప్రయత్నించు. వగచుట మాని వెలుగుట నేర్చుకో. నీ కొరకు జీవించుటలో ప్రమాదముందని, పరుల కొరకు జీవించుటలో ప్రమోదముందని గ్రహించు. సంతసించు. తరించు.

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 5

ప్రియాత్మా!

హరి: ఓం....ఓం నమో నారాయణాయ

ప్రతి పుట్టుకకు చావు వుంది. ప్రతి అభివృద్ధికి అవరోధ మున్నది. ప్రతి నడకకు నిలుపుదల యున్నది. ప్రతి సంయోగానికి వియోగ మున్నది. కూడగట్టిన దంతా కుళ్ళిపోయేదియే. దేహసౌందర్యమంతా శ్మశానసంపదయే.

ఆలోచించు. ఈ ప్రపంచములో ఏదీ నీ అధీనములో లేదు. ఈ సత్యమును పదేపదే మననము గావించు. విషయసుఖాలలోని దోషమును కనిపెట్టి వాటికి దూరంగా నిలబడే అలవాటును చేసుకో. నిత్యానందము నొసంగే పరమాత్మను సమీపించి సుఖించు.

పరమాత్మను ఎలా పొందాలి? లేనిదానిని పొందడము కష్టము గానీ ఉన్న దానిని దర్శించుట దుస్సాధ్యము కాదు. పరమాత్మ అవగాహనలో లభిస్తాడు. అహంకారమును దూరము చేసుకొంటే వెంటనే గోచరిస్తాడు. ప్రేమపలుకులో ప్రతిఫలిస్తాడు. సేవాజీవనములో దర్శనమిస్తాడు. కన్నీళ్ళ మధ్య కదలనిచో కమలనాభుడు రమణీయంగా కనుపిస్తాడు. ఎదుటివారి కన్నీళ్ళను తుడువగలిగినచో నీ ఎదలో సుస్థిరంగా నిలుస్తాడు. కళ్ళు పూడుకపోయే పనులు చేయనివారి నేత్రాలలో సదా తొంగి చూస్తూనే యుంటాడు.

నీ ఇంటికి వచ్చేవాడెవడైనా నీ దేవుడే. నీవు వెళ్ళే గృహమేదైనా అది పుణ్యక్షేత్రమే. ప్రేమను వర్షించే దృష్టియే సరళధ్యానమని జ్ఞాపక ముంచుకో.

ఈదుతూ ఉంటే ఈత వస్తుంది. త్రొక్కుతూ ఉంటే సైకిలు నడుస్తుంది. తింటే రుచి తెలుస్తుంది. జీవిస్తే జీవనశోభ గోచరిస్తుంది.

భగవానుడు నీ తోడుగా నిలచియే యున్నాడు. నీ మనస్సును అతనితో ముడివేయి. దివ్యమైన కాంతి, శాంతి, బలము, ఆనందము నీకు పుష్టిగా లభిస్తాయి. ఇది నా అనుభవము. నీవూ పంచుకో.

ప్రేమతో

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 6

ప్రియాత్మా!

ఓం నమో నారాయణాయ.

గోడ యొక్క గట్టితనం ఇటుకలపై ఆధారపడి యున్నట్లు, దేశము యొక్క ప్రగతి యువకుల మీద ఆధారపడి యుంటుంది. కనుక యువతను దృష్టిలో ఉంచుకొని కొన్ని ఉత్తరాలు వ్రాయాలని సంకల్పించాను. ఆ ప్రయత్నంలో ఇది ప్రథమ ఉత్తరం.

సాధుత్వమును హింసించిన తండ్రిపై తిరుగుబాటునకు ప్రహ్లాదుడు వెనుకాడలేదు. ధర్మాన్ని దారిమళ్ళించిన తల్లితో భరతుడు ఏకీభవించలేదు. వ్యక్తి సుఖానికై సమాజమును బలిగొనేందుకు ముందుకురికిన రావణునితో తమ్ముడైన విభీషణుడు ఏకీభవించలేదు. నేటి యువతరంలో కూడా అలాంటి ఆవేశము, త్యాగము గోచరిస్తున్నవి. కానీ ఈనాటి త్యాగాలు ఆదర్శాలు కాలేక పోతున్నాయి. ఎందుకని? ఇక్కడే యువతరం తన మనోతరంగ చలనాన్ని చక్కదిద్దుకోవాలి.

ఈనాడు విద్యార్థిలోకంలో ఎక్కువగా విప్లవనాదం వినపడుచున్నది. ఈ నాదంతో శ్రుతి కలిపి ఎందరో యువతీయువకులు బ్రతుకులను హారతి కర్పూరం చేస్తున్నారు. హత్యలకు, దారుణ మారణహోమాలకు కూడా వెనుకాడుట లేదు. ఇదంతా దేనికొరకు? ఆర్థిక సమానత్వానికా? ఆకలి బాపుకొనుటకా? అదే వాస్తవమైతే మన ఆవేశానికి లక్ష్యము లేదని భావము. వివిధ స్థాయిలలో ముడిపడియున్న బ్రతుకును ఒకే కోణంలో దర్శించి ఏమి సాధించగలము?

సుస్థిరజీవనమును సాగించుటకు ధనమవసరము. కానీ ధనమే సుఖాన్ని పంచలేదు. ధనంలో సుఖముంటే ధనికులంతా సుఖంగా యుండాలి. ఉన్నారేమో ఆలోచించండి. విప్లవాల వలన భేదాలు సమసిపోతాయా? అలా అయితే ఆ మార్గము కూడా కళ్యాణప్రదమే. మరి విప్లవపంథాలో నడచేవారిలో ఈ భేదాలు, అసూయలు, ఈర్ష్యలు, పదవులకై పోరాటాలు అంతరించాయా?

ఆవేశాలు ఆశయాలను ఫలింపజేయవు. ఆలోచనయే ఆశయానికి జీవం పోస్తుంది. సమాన ప్రతిపత్తియే గాకుండా సహజ ఉత్పత్తి కూడా ఉండాలి.

సామాజికస్ఫూర్తి కావాలి. కానీ అది వ్యక్తి యొక్క దీప్తిపై ఆధారపడి యుంటుందనే నగ్నసత్యమును మరువకూడదు.

అరాచకాలన్నింటికీ ధనమే మూలమని భావించకూడదు. ధనికుడు అరాచకం చేయవచ్చు. కానీ అరాచకాలు చేసేవారంతా ధనికులేనని చెప్పగలమా? ఆర్థిక సమానత్వం తెస్తే సరిపోదు. హార్దికంగా బాగుపడని సమాజము దానిని నిలుపుకోలేదు. వ్యక్తిలో శీలాన్ని పెంపొందించాలి. మంచిని పోషించాలి. ఈ మార్పు నైతికశిక్షణ ద్వారానే జరుగుతుంది. సమాజం తనకన్నా భిన్నం కాదనే సామాజికస్ఫూర్తిని వ్యక్తిలో కలిగించడం ద్వారానే ఏర్పడుతుంది.

ప్రేమ అంతరించిన మనస్సులో హింస చెలరేగుచున్నది. హింస రేగిన మనస్సులో ప్రేమ చిగురించదు. హింసాప్రవృత్తికి అలవాటుపడిన హృదయం హింసను పంచగలదే గాని ప్రేమను దించలేదు. వెలిగే దీపమే మరియొక దీపమును వెలిగించగలదు. ప్రేమించే హృదయమే మరొక హృదయములో ప్రేమను నింపగలదు.

తాను ధనికుడై తోటి మానవులను హింసిస్తున్నా డొకవ్యక్తి. తాను సంపాదించే నాలుగు పైసలు ఇంటిలోని నలుగురి కుపయోగించక తానొక్కడే త్రాగేసి తూలుతున్నాడు మరియొక వ్యక్తి. ఈ ఇరువురిలో ధర్మరాజెవరు? దానకర్ణుడెవరు? ప్రక్కవాడిని ఒకడు పాడుచేస్తే, తనవారినే మరొకడు పతనం చేస్తున్నాడు. ఈ రెండింటిలో ఏది పాయసము? ఏది పాషాణము? వాయసమువలె వాగకుండా సామరస్య జీవనానికి పునాదులు నిర్మించగలగాలి.

ధర్మబోధ వలననే వ్యక్తిలో దయ నిండుకుంటుంది. దయగల హృదయమే ఎదుటి వ్యక్తి హృదయాన్ని తృప్తి పరచగలదు. గాయాలను మాన్పగలదు. ఈ కార్యక్రమంలో యువకులు ముందుకు రావాలి. సమాజాన్ని నడిపించాలి.

ప్రేమతో
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 7

ప్రియత్మా!

హరి: ఓం...ఓం నమో నారాయణాయ

వందనములు.

తోసుకొంటూ తొంభైలో పడ్డాము.* తూలుతూ, తోలుతూ, బ్రతుకు బండిని తొంభైలోకి నెట్టాము. తొలిమాసపు తొలకరి ప్రారంభ మగుచున్నది. తొలిపలుకును పలికేందుకు సిద్ధమవుతున్నాము. ద్వాదశ పుటల వార్షికగ్రంథంలో ప్రథమ పుట కదిలింది. కనీసము ఈ ప్రత్యూషమైనా జ్ఞానజ్యోతిని వెలిగిస్తుందా? జీవనశాంతిని విరజిమ్ముతుందా?

రోజులు దొర్లిపోతున్నాయి. వార్షికములు మరలిపోతున్నాయి. బ్రతుకు మరిగిపోతున్నదే గాని మెరుగు కావడం లేదు. పాతలోని రోత తెలిసిరావడం లేదు. క్రొత్తలో చెత్త దూరమగుటలేదు. నూతనత్వము తెలియని వార్షికాలు ఎన్ని వచ్చినా బ్రతుకు ఎండమావిగానే మిగిలిపోతున్నది. ఈ పడిగాపులు, చెడు ఊహలు మనకొద్దు. ఇకపై ఆనందతోరణాలు వెల్లివిరియాలి. ఇది మనకు సాధన సంవత్సరం కావాలి.

విన్నవి ఎన్నియో? చదివినవి మరెన్నియో? పలికినవి ఇంకెన్నియో? చాలు...చాలు...సంగీత మొచ్చేసింది. ఎందులకు? ఆలపించేటందులకు కాదా? వ్యక్తం గాని మూగస్వరాలు ఎవరిని తృప్తిపరుస్తాయి? ఎంతో నేర్చుకున్నాము. దేనికి? ఆచరించేటందులకు కాదా? ఆచరణ లేని జీవికి అనుభవమెలా ప్రాప్తిస్తుంది? చలనము లేని బ్రతుకుకు మిగిలేది మరణమే.

చలించినంత మాత్రాన సరిపోదు. చేతనత్వముతో చరించే స్థితిని అలవరచుకోవాలి. ఆటోమాటిక్ వాచ్ నీ చేతిపై నిలిచి కదులుతూనే ఉంది. అనుభవమును పొందలేని ఆ యంత్రము కదలి కదలి కూలబడుతుంది. అంతే, నీవు కేవలం నడయాడే గడియారము కారాదు. నడక తెలిసి, నాణ్యత గడించే గణ్యుడవు కావాలి. గమ్యము తెలిసి చరించే ధన్యుడవు కావాలి.

గతం గతించినది అంటారు. ఇది నిజమా? ఇదే వాస్తవమైతే భవిష్యత్తు పూలబాటయై నిలుస్తుంది. గతం గతించలేదు. అది పొయ్యిలో పడి కాలిపోలేదు. నుయ్యిలో పడి మునిగిపోలేదు. మనస్సులో ఊరుతూనే ఉంది. బుద్ధిలో తేలుతూనే ఉంది. క్రొత్త చింతకాయ లొచ్చినా పాత పచ్చడియే మిగిలియుంది. ఆలోచించండి.

* ఇది 1990 జనవరి మాసములో నూతనసంవత్సరం సందర్భంగా స్వామీజీ వ్రాసిన లేఖ

నూతనసంవత్సర మనగానే నూతన ప్రణాళికలు, నూతన పథకాలతో కదలాలి యని ప్రతి ఒక్కరూ తీర్మానించుకొంటూ, తీర్పు చెప్పుకొంటూ ఉంటారు. దీనివలన బ్రతుకులో మార్పు రావడంలేదు. రాదుకూడా. క్రొత్తదనం క్రొత్త విషయాలలో లేదు. పాత చెడులు చిగురించకుండా చూసుకోవడంలో ఉంది. పాతబస్తీలో కొత్తకుస్తీ నేర్చుకోవడంలో ఉంది.

పాతమోతలను వదలకుండా క్రొత్త పుంతల నెలా త్రొక్కాలి? ఇది అసంభవము కాదా? అని మీరు ఆలోచించవచ్చు. పాతక్రొత్తల కలయికే జీవిత మనెడి నగ్నసత్యాన్ని విస్మరించేందుకు వీలులేదు. జీవితమొక క్రీడారంగము. ఆట సాగుతూ ఉంది. ప్రతిపక్షము కొంత ఆధిక్యతలో యున్నది. అలాగని క్రీడాకారుడు నీరసపడునా? వేగముతో సాగి విజయమును పొందేందుకు యత్నించును. ఇదీ అంతే. గతంలోని పొరపాట్లు తిరిగి జరుగకుండా చూసుకొంటూ ముందుకు దూసుకపోవడంలో అందముంది. ఆనందముంది.

క్రొత్త తీర్మానాల వసరము లేదు. పాతను పరిశీలించండి చాలు. సాధ్యరూపుడైన పరమాత్మను గూర్చి ఆలకించాము. కానీ సాధనను ఆరంభించలేక పోయాము. కోపాలు తగనివని విన్నాము. కానీ ఎదురైన వారందరిపై శాపాలను క్రుమ్మరించాము. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుర్తించాము. కానీ కాలాన్ని వృధా చేయడములో బుద్ధిని వినియోగించాము. ప్రగతిని ఊహిస్తూ పతనంలో కాలు మోపాము.

జరిగిపోయింది. వత్సరం కదలిపోయింది.

వగచి సాధించేదేముంది? వలచి సాగడంలోనే ప్రగతి నిలిచి ఉంది. క్రొత్త విషయాలలో క్రొత్తదనము లేదు. పాతవి తొంగి చూడకపోతే మిగిలిన దంతయూ క్రొత్తదనమే.

ఇది మనకు సాధనసంవత్సరము. కాలాన్ని వృధా చేయకండి. కర్మలను సరిజేసుకుందాం. ఎక్కువ కాలాన్ని జపధ్యానాదుల యందు గడుపుదాం. దోషాలు చూడకుండా జీవిద్దాం. ప్రేమిస్తూ బ్రతుకుదాం. కలిసి జీవించే నేర్పును అలవరచుకుందాం.

కొండను మోపిన కమనీయమూర్తి మనకు అండగాయున్నాడు. నిండు మనస్సుతో, కొండంత తృప్తితో దండిగా జీవించడమే మనం నేర్చుకోవాలి.

పరిశీలించండి. ప్రయత్నించండి. బలహీనతలను పూడ్చిపెట్టండి. సత్యప్రేమలను అందల మెక్కించండి. ఆదర్శముగా జీవించండి. ఆనందముతో శోభించండి.

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 8

ప్రియాత్మా!

హరిః ఓం... ... ఓం నమో నారాయణాయ

వందనములు.

నీవు భక్తుడవైనచో ధన్యజీవివి. భగవంతు డెక్కడున్నాడు? అని విచారించకు. నీవు చింతించ నవసరము లేదు. చిరునామా నావద్దనే యున్నది. నీకు ప్రేమతో అందిస్తాను.

శ్రమించే శక్తిలేక, రోగముల వాతబడి గుడిసెలలో మగ్గిపోతున్న పేదవాని హృదయంలో నిలిచి నీ సేవకై నిరీక్షిస్తున్నాడు. పదుగురిచే ఏవగింపబడి సమాజానికి దూరుడై వెలుగుకోసం పరితపించే నిర్భాగ్యుని గుండెలో నిలిచి నీ ఓదార్పుకై వేచి యున్నాడు. ఎదుటి వ్యక్తి ఆకలిలో అచ్యుతుని ఆక్రందన యున్నది. ప్రక్కవాని కన్నీటిని చూడు. కమలనాభుని కలవరము అచ్చట ప్రత్యక్ష మగుచున్నది. ఆవేదనలో అలమటిస్తున్న నీ ఆరాధ్యదైవమును ప్రక్కకు నెట్టి నీవు సాగించే ఆరాధనలు సాధనసోపానము లవుతాయా? ప్రేమ లేని హృదయ గుడిలో పరమాత్మ వసించునా?

ప్రారబ్ధవశాత్తు ప్రక్కవాడు పతితుడయ్యాడు. వానిని సరిజేసే నీ ప్రయత్నములో దాగి నిన్ను ఉద్ధరించేందుకు పరమాత్మ సిద్ధంగా యున్నాడని నీవు గ్రహించితివా? ఎదుటివాడు దుర్మార్గుడే కావచ్చు. యెదను తెరచి పలుకరించగలిగితే అతడు నీకు ఆత్మీయుడవుతాడు. అతనిలోని అచ్యుతుడు నిన్ను ఆశీర్వదిస్తాడు. పరులను ప్రేమిస్తే నీకు ప్రియులు, మిత్రులు లభిస్తారు. వారిని భక్తితో ఆరాధిస్తే వారిలో నీకు పరమాత్మ దొరుకుతాడు.

ఆరాధించి ఆనందించదగిన చోట అసహ్యాలు, ఆవేదనలు ఎందుకు తలెత్తుచున్నవి? రోగిని చూసి అసహ్యించుకోకు. దేహము రోగాల పుట్టయేనని, ఎప్పుడైనా, ఎక్కడైనా ఎవరి దేహమైనా రోగములకు నిలయము కావచ్చు యనెడి నగ్నసత్యాన్ని గ్రహించు.

అశ్లీలుడైన మానవు డనుభవించే అనంతదుఃఖమును గాంచి శీల ప్రభావమును గుర్తించు. నీలో నూతనమైన అవగాహనను చిగురింపజేసి నీ

బ్రతుకుబాటకు వెలుగుతోరణాల నలంకరించిన వ్యక్తిపై నీ కృతజ్ఞత ఎందుకు కుంటుపడుతుంది?

అవగాహన లేని మూర్ఖులు స్థిరపడిన విషయాలను అస్థిరమొనర్చుచు ఎందరినో ఆవేదనలకు గురిచేయుట నీవు గాంచుటలేదా? వారిపై విరుచుకపడుట కన్నా అలాంటి తప్పిదములను చేయకుండా ప్రేమతో చరింపవలె ననెడి నిర్ణయము నీలో ఏర్పడుటలేదా? ఏర్పడినచో ఈవిధమైన అవగాహనను నీ కందించిన ఆ దుఃఖభాగు డెవరో నీకు ఆదర్శమూర్తియే గదా?

వైద్యుడు రోగిని పరీక్షించి రోగనిర్ణయం చేస్తాడు. రోగనిర్ణయమైన తరువాతనే చికిత్స మొదలవుతుంది. రోగనిర్ణయంలో తప్పిదము జరిగినచో చికిత్స చేసి సాధించే దేమియును ఉండదు. బాగా ఆలోచించు. చక్కని ఆలోచన కడుచక్కని ఆచరణను అందిస్తుంది. చెడిన మనస్సు బ్రతుకును చెడిపి తీరుతుంది.

నీవు మేధావివి కావచ్చు. అయినను నీవు అధిగమించలేని కొన్ని పరిస్థితులు, ఇక్కట్లు నీకు ఎదురు కావచ్చు. నీ అవగాహనయే నీకు అడ్డంకుల నేర్పరచవచ్చు. అడ్డుతీగయై గడ్డు సమస్యను కల్పించవచ్చు. ఊహించని విధంగా వెతలు చుట్టు ముట్టవచ్చు. కాంతి దూరం కావచ్చు. అశాంతి దగ్గర కావచ్చు. ఇట్టి క్లిష్ట సమయాలలో నీ అనుభవము నిన్ను నడుపలేక పోవచ్చు. ఈ స్థితిలో నిన్ను నడుపగలిగే శక్తి ఒక్క భగవంతునికే కలదు. శరణాగతుడివి కా. ఆవేదనలను అచ్యుతుని అభయహస్తములో ఉంచి, కలత నెరుగని భక్తితో, కలవరము తెలియని శక్తితో ముందుకు సాగిపో. భగవంతుడు నీ మనస్సును పరికరముగా గ్రహించి అద్భుతమైన ఆలోచనలను కదిలిస్తాడు. నీ దేహమును పనిముట్టుగా స్వీకరించి అనూహ్యమైన దివ్యకర్మములను నీ ద్వారా కొనసాగిస్తాడు. ఈ పరమ సత్యమును నీవు గ్రహించి పరమాత్మకు శరణాగతుడ వైనచో, భగవత్కృప నీలో ప్రవేశించి నిన్ను శుద్ధిచేసి నీ ద్వారా ప్రపంచమును పవిత్ర మొనర్చును.

నిరంతరము అనంతుడైన పరమాత్మనే భావించు. అనవరతము అచ్యుతుడైన పరంధామునే సంభావించు. బ్రతుకులో బాధలు నిలువవు. బరువులు మిగలవు. ప్రయత్నించు.

ఓం...ఓం...ఓం

సాధకజన సేవలో

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 9

ప్రియాత్మా!

హరిః ఓం ... . ఓం నమో నారాయణాయ

వందనములు.

సాధన కర్మరూపంగా తెలిసినను వాస్తవానికి అది భావరూపమే. కర్మకు పూర్ణాహుతి ఉంది. కానీ భావానికి పూర్ణాహుతి ఎక్కడ? భావరూపమైన సాధనకు శరణాగతియే పూర్ణాహుతి. పూర్ణాహుతి జరిగిన పిదప ఇక కర్మ లేదు. శరణాగతి జరిగితే ఆ తరువాత కర్త మిగలడు.

మరణగతి తెలియని స్మరణస్థితియే శరణాగతి.

సాధన సౌలభ్యము తెలిసినవారికి సాధ్యవస్తువు లభిస్తుంది. చరించే నేర్పు అలవడితే తరించే మార్పు అగుపిస్తుంది. సాధన ప్రగతి వేదనల వలన రాదు. వేడుకొంటే రాదు. కాలప్రమేయముతో కదలదు. కనికరిస్తే కలుగుతుంది. దైవము కరుణ జూపితే మిగులుతుంది.

మన ఆచరణయే మనకు ఆవేదనలను అందించుతున్నది. పరమాత్మ తన అపారకృపతో ఆవేదనలను ఆరాధనలుగా మార్చుతున్నాడు. నీవు భక్తుడవైనచో ప్రతి సన్నివేశములో పరమాత్మ హస్తమును దర్శింపగలవు.

పరమాత్మ పవిత్ర కరమును మనము పట్టుకొనగలమా? ఆ దివ్యాత్ముని పవిత్ర సంకల్పమును మనము కనిపెట్టగలమా? పరిమిత మనస్సుకు అపరిమితమైన శక్తి ఎలా అవగత మవుతుంది? గనుక బుద్ధిని పరమాత్మకు సమర్పించి, అలా సమర్పించినట్లు కూడా తెలియని దివ్యానందములో మైమరచిపోవాలి. అదియే నిజమైన శరణాగతి.

భగవానునికి నీవు శరణాగతుడ వైతివి. ఆ తరువాత నీలో "నేను-నాది" అనేది ఎలా మిగులుతుంది? ఆలోచించు. "నేను భగవానునకు శరణాగతుడను" అని పలికే మనస్సు ఎక్కడ నిలిచి ఆమాట నంటున్నది? శరణాగతి జరిగిన తరువాత ప్రత్యేకమైన ఉనికి ఎలా నిలుస్తుంది? శరణాగతిని గూర్చి ప్రవచించే "అహం" మిగిలియున్నంత వరకు శరణాగతి ఎక్కడ జరిగింది?

'నేను పరమాత్మకు శరణాగతుడను. అయిననూ నాకు బాధలు తీరుటలేదు' అని సాధకులు పలుకుతుంటారు. ఇదియేనా శరణాగతి? నీవు భగవానునకు పూర్ణ శరణాగతుడ వైనచో ఆ తరువాత ఈ బాధలను గుర్తించుచున్న దెవరు? ద్వైతము తెలిసినంతవరకు పూర్ణశరణాగతి జరుగలేదనియే భావించాలి.

శరణాగతి జరిగిందంటే మనస్సు ఆశించదు. ఇంద్రియాలు ఆక్రోశింపవు. బుద్ధి ప్రశ్నించదు. చిత్తము చలించదు. అహంకారము అగుపించదు. హృదయము తపించదు. ద్వంద్వములు తెలియని ఆ సమస్థితిలో విషమగతులు అర్థంకావు. కనుక శరణాగతి మార్గమే కాదు. గమ్యము కూడా.

శరణాగతిలో ముఖ్యంగా మూడు విషయాలను జ్ఞాపక ముంచుకోవాలి. (1) పరమాత్మ సత్యము. అన్యమైనదంతయు అశాశ్వతము (2) పరమాత్మ కరుణాసముద్రుడు. సరియైన సమయంలో భక్తుల బాధలను నివృత్తి చేసి ఉద్ధరిస్తాడు.(3) సర్వకర్మములు ఆయన దివ్యకృప వలననే సాగిపోతున్నాయి.

మొదటి లక్షణము శరణాగతిని ధ్రువపరచును. స్థిరపరచును. రెండవ లక్షణము ఆందోళనలను, ఆవేదనలను అంతమొందించి చిత్తమును శివుని యందే నిలుపును. మూడవ లక్షణము వ్యక్తిని నిరంతరము పూర్ణశాంతిలో ఓలలాడునట్లు చేయును.

శరణాగతియే సర్వులకు గతి లేక గమ్యము. సమస్త యోగముల యొక్క గతి కూడా శరణాగతియే.

గతి తెలిసి, మతి నిలిపి, చితి రగిలేలోగా పతిని దర్శించు. కరుణను విస్మరించకు. తరుణము మించనీకు. ప్రయత్నించు.

శరణాగతియే జీవికి పూర్ణాహుతి.

శర్వుని చరణముల చెంత
శరణీయుడు
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 10

ప్రియాత్మా!

హరిః ఓం ... ... ఓం నమో నారాయణాయ

వందనములు.

విభిన్న ప్రవృత్తులు గల వ్యక్తుల సముదాయమే కుటుంబము. పరస్పర భిన్నమైన చిత్తవృత్తులు గల వ్యక్తుల హృదయాలను సమన్వయ దృక్పథంతో ఏకోన్ముఖం చేసి గృహమును దేవాలయముగా మార్చే శక్తి ఒక్కరికే గలదు. అందుచేతనే ఆ దివ్యమూర్తిని గృహలక్ష్మి యని హిందూధర్మము కీర్తించినది.

ఏ గృహంలో ఏవిధమైన సమస్య తలెత్తినను అది అపరిష్కృతంగా మిగిలినచో ఈ ధోరణికి గృహలక్ష్మి అసమర్థతయే ముఖ్యకారణమై యుంటుంది.

సమాజసేవ ద్వారా తరించాలని ఈనాడు తల్లులు భావించి ఇంటిని వదలి సేవాకార్యక్రమాలలో కాలిడుతున్నారు. మంచిదే. కానీ సమాజసేవకు అంకితమైన తల్లి తన ఇంటిని ఎంతవరకు చక్కదిద్దగలిగింది? ఆమె ఊహించే సమాజంలో తన ఇల్లు ఇమిడియుండలేదా? గృహంలో శాంతిని నింపండి. ఆ తరువాత సమాజంలో శాంతిని దింపండి. ఇంటికి మించిన సేవాకేంద్రము మరెక్కడో లభిస్తుందని నేను భావించుటలేదు. భర్త విషయంలో, పిల్లల విషయంలో,అత్తమామల విషయంలో, అతిథుల విషయంలో తల్లులకు అనేక బాధ్యతలున్నాయి. సక్రమంగా వీటన్నిటిని అవగత మొనర్చుకొని ఆచరించ గలిగితే గృహము స్వర్గతుల్య మౌతుంది. ఈ లేఖలో పిల్లల విషయంలో తల్లుల బాధ్యతను గూర్చి చర్చిద్దాము.

బిడ్డలపై తల్లి ప్రభావం పడినట్లు మరెవ్వరి ప్రభావమూ పడదు. ప్రథమంగా బిడ్డ గర్భంలో ఉన్నప్పుడే తాను చేసెడి సత్సంకల్పముల ద్వారా, తీసుకొనెడి సాత్వికాహారము ద్వారా తల్లి బిడ్డకు గొప్ప మేలు చేయగలుగును.

పిల్లలలో సాధారణంగా అనుకరణసహజాత ముండును. వారు సదా పెద్దలనే అనుకరించుచు అభినయించుచుందురు. తల్లి అలవాట్లు పిల్లలకు అలవడును. అందుచేత పెందలకడనే తల్లి నిద్ర లేవాలి. దైవప్రార్థనల యందు కొంతకాలము గడపాలి. అతిథులను ప్రేమతో పలుకరిస్తూ ఉండాలి. భర్తను, అత్తమామలను గౌరవిస్తూ ఉండాలి. సకాలానికి పనులు చేయగలగాలి. తీరిక సమయాలలో ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతూ ఉండాలి. ఈవిధమైన తల్లి

ప్రవర్తన పిల్లలను చక్కగా తీర్చగలుగుతుంది.

పిల్లలతో కఠినంగా ప్రవర్తించరాదు. ప్రక్కయింటి పిల్లలతో పోల్చి నిందించరాదు. నీ బిడ్డలలో ఒకరిని ఎక్కువగా, మరొకరిని తక్కువగా ప్రేమించరాదు. మాట వినని బిడ్డ ఎవరో కాదు. గతజన్మలోని నీ కర్మలయొక్క ఫలితమే. ఓర్పును వహించి నేర్పుతో జీవించు.

మీ ఇంటిలో ఎందరు పరిచారిక లున్నను నీ కుమార్తెలు కూడా ఇంటి పనులలో నిమగ్న మయ్యేటట్లు చూసుకోవాలి. ఇది ఎలా సాధ్యం? తల్లులు ఆచరించినపుడే బిడ్డలు ఆచరిస్తారు. పని తెలియని, చేయలేని ఆడబిడ్డ భవిష్యత్తులో అత్తవారింట గృహలక్ష్మిగా శోభించలేదు.

ఇంటిలో పాదరక్షలతో తిరుగకూడదు. ఏవిధంగా చూసినా ఇది అనాచారమే. ఇంటిలో శుభ్రత లేకపోతే శుద్ధి చేసుకోవడమే కర్తవ్యము. పాదరక్షలు ధరించి తిరుగుట కాదు.

పిల్లల ముందు పొరుగువారిని, బంధువులను విమర్శించకు. పిల్లల ఎదుట పెద్దలను గౌరవించే సుగుణాన్ని కల్గియుండాలి. నిగ్రహము లేని భర్త పిల్లల ఎదుట భార్యను దూషించవచ్చు. ఇక్కడే తల్లిపాత్ర శోభించాలి. భర్త కోపాన్ని శాంతముగా అనుభవించాలి. నవ్వుతూ కనిపించాలి. ఈవిధమైన వైఖరిని తల్లి ప్రదర్శింప గలిగితే భవిష్యత్తులో తన బిడ్డలు అత్తవారింట సుఖంగా జీవించేందుకు అనువైన బాటను నిర్మించ గలిగినదని భావము.

ప్రతి స్త్రీమూర్తి బ్రతుకులో దుర్భరమైన బాధలను అనుభవించే యుంటుంది. ఈ సత్యము నాకు తెలియక పోలేదు. కానీ తాను అనుభవించిన బాధలను పిల్లల ఎదుట పలవరించకూడదు. ఒకవేళ తాను చెప్పదలచినచో తన జీవితంలో అలవరచుకొనిన సుగుణాలు, భగవద్భక్తి, అనుభవించిన భగవత్కృప ఇలాంటివే పిల్లలతో ముచ్చటించాలి. పిల్లల హృదయాలలో నిరాశావాదము, హింసాప్రవృత్తి ద్వేషవృత్తి చోటుచేసుకోకుండా జాగ్రత్తపడాలి.

శాంతిగృహ నిర్మాణ పథకంలో
మీ
స్వామి సుందర చైతన్యానంద

ప్రియాత్మా!

లేఖ II

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

గృహస్థాశ్రమము పరమ పవిత్రమైనది. గృహస్థుడు పుణ్యాత్ముడు. గృహస్థ అనగా గృహమునందు స్థిరపడినవాడని భావము. గృహమంటే ఇల్లు అని భావము కాదు. స్వస్థానము అని అర్థము. పరంధాముడే మనకు స్వగృహము. నిజ బంధువు కూడా.

నివాస శ్శరణం సుహృత్

అని భగవద్గీత కూడా ప్రవచించినది. ఈ సత్యము హృదిలో స్థిరపడినచో గృహస్థుడు ఆత్మస్థుడే కాగలడు. ఆత్మస్థితుడై జీవించేటందులకు అనువైనది యగుటచేత గృహస్థాశ్రమము పవిత్రమైన ఆశ్రమముగా నిర్ణయింపబడినది.

దేవాలయమువలె గృహాలయము కూడా భగవత్సేవకు ఉపకరించే దివ్య మందిరమని గృహస్థులు భావించాలి. ఆలయము వలె ఇల్లు కూడా పవిత్రంగా ఉండాలి. ఆలయంలో అడుగు పెట్టగనే దివ్య సంకల్పాలు మనస్సులో కదలునట్లు, ఇంటిలో ప్రవేశించగనే ప్రశాంతత బుద్ధి నావరించాలి. స్పర్థలు, కార్పణ్యాలు, ఈర్ష్యలు, రాగద్వేషాలు లేకుండా చూసుకోవాలి. అప్పుడే గృహము ఆలయ మవుతుంది. ఆలయంలో ప్రతి వస్తువు, ప్రతి వ్యక్తీ మనకు పరమాత్మనే జ్ఞప్తికి తెస్తూ ఉంటారు. ఇంటిలోని సభ్యులు, పనివాండ్రు, అతిథులు, బంధువులు అందరూ పరమాత్మను గుర్తు చేసేవారై యుండాలి. ఇది ఇతరులు చూపడంలో లభించదు. మనము చూడటములో ప్రాప్తిస్తుంది.

నీవు ధరించియున్న వస్త్రము ముళ్ళపొదకు తగులుకొనినచో నీవు అడుగు ముందుకు వేయలేవు. మెల్లగా, చల్లగా ఆ తగిలింపులను తొలగించుకొని ఆ తరువాత ముందుకు చరిస్తావు. గృహస్థాశ్రమములో కూడా అంతే. ఎదురయ్యే అడ్డంకులను అవగాహనతో ప్రశాంతముగా అధిగమించే అలవాటును గృహస్థుడు అలవరచుకోవాలి.

ఇంటికి వచ్చే అతిథులను ప్రేమతో అహ్వానించాలి. వారిలో పరమాత్మను వీక్షిస్తూ, ప్రేమతో పలుకరించాలి. ఇది గొప్పదైన, దివ్యమైన సుగుణము. ఈ సద్భావము సద్రూపుడైన పరమాత్మను ఒకనాడు నీ ఇంటికి నడిపించి తీసుకొని వస్తుంది. ఈ అవగాహన ఈనాడు ఆశ్రమాలలో కూడా కనుపించడము లేదు. కార్యాలయ సిబ్బందివలె ప్రవర్తిస్తూ, వచ్చినవారు నొచ్చుకొనేలా పలవరిస్తుంటారు. పైగా ఈ ప్రవర్తనను అందరూ మెచ్చుకోవాలని ఆరాట పడుతుంటారు కూడాను.

ఏంచేస్తాం? ఆశ్రమాలలో ఎందరైనా నివసించగలరు. కానీ కొందరే జీవించగలరు. సరియైన అవగాహనతో, ప్రేమతో జీవించే గృహస్థుడు ఆశ్రమవాసి కన్నను ఉత్తముడే యని నా అభిప్రాయము.

అతివాగుడు అనర్థాలను తెచ్చి పెడుతుంది. మీ ఇంటికి వచ్చిన వారితో వ్యర్థప్రసంగములు చేయకండి. ఇతరులను విమర్శించుకొంటూ జీవించకండి. వచ్చిన వారితో సద్విషయాలనే ముచ్చటించండి. ప్రేమించే హృదయానికి శత్రువులు లేరు. మనలో ప్రేమప్రవాహము కదలగనే, ఇతరులలో గిరులవలె తెలియు దోషాలు కూడా మునిగిపోతాయి. కనుపించకుండా కనుమరుగవుతాయి.

బ్రతుకులో బాధలు దొర్లుతూ ఉంటాయి. అలాగని నీవు కన్నీళ్ళతో పొర్లుతూ విలపించకూడదు. బాధలలో నీకు బోధలు లభించాలి. ఆవేదనలలో నీవు ఆనందమును చేజిక్కించుకోవాలి. బ్రతుకొక నాటకమని సదా గుర్తుంచుకో. నటుడు తనను తానెరిగియే యుండును. పాత్ర నభినయించుచుండును. నీవు ఆత్మవే ననెడి భావనను ఆంతర్యములో స్థిరపరచుకొని, బాహ్యంలో నీ పాత్రను పోషించు. ఈ అవగాహనలో బాధలు స్ఫురించవు. బాధ్యతలు తెలుస్తాయి. బోధలు అందుతాయి.

ఇంటిలోనివారు నీ సద్భావాలను గౌరవించలేదని వ్యథ చెందకు. మీ మాటలు వారి మనస్సును కదిలించలేకపోవచ్చు. కానీ మీ మౌనం వారి హృదయాన్ని తట్టిలేపుతుంది. మాట వినని వారిలో పరమాత్మను దర్శించి అభ్యర్థించు. భగవాన్! నా మంచి పలుకులు వారి మనస్సులనుండి జారిపోకుండా రక్షించు" అని ప్రేమతో ఎదుటి వ్యక్తిలోని పరమాత్మను దర్శిస్తూ సంభావించు. వెంటనే వారిలో అనూహ్యమైన మార్పును నీవు చూడగలవు.

వ్యక్తులకు దూరమై ఎవ్వరూ బ్రతుకలేరు. మన వ్యక్తిత్వంలో మార్పు రాగలిగితే నేర్పుతో జీవించగలము. కడలిలో స్నానము చేయుటకు కెరటములు అడ్డురావు. బ్రతుకులో స్ఫూర్తితో జీవించేందుకు బాధలు అడ్డురావు. పైగా జీవన నౌకకు తెడ్డులా సహకరిస్తాయి. గడ్డను తొలగిస్తాయి. ఒడ్డుకు నడిపిస్తాయి.

భాషాజగత్తు అర్థంగాని భావ సుషుప్తిలో
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 12

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

మితజీవనము స్థిమిత జీవనము నందించును. మితము హితమును చేకూర్చును. మితిమీరి జీవించువారు దుఃఖము ననుభవించుటను మనము గాంచుచునే యున్నాము. అతి ఎప్పుడూ అనర్థాన్నే అందిస్తుంది.

జీవించడానికి ఆహారము అవసరము. అదికూడా మితంగానే యుండాలి. విశ్రాంతికి నిద్ర అవసరము. అతిగా నిద్రించువాడు సోమరిపోతు అవుతాడే గాని సాధకుడు కాలేడు.

సాధకునికి భాషణమే భూషణము. తియ్యని పలుకులు గలవాడు లోక పూజ్యుడగును. నీవు ఇతరులకు ఎంత సహాయము నైనను అందించవచ్చు. కానీ నీ పలుకులో తియ్యదనము లేనిచో అది ఉప్పులేని పప్పువలె యుండును. కూర లేకుండా అన్నము వడ్డించినట్లుండును. అతివాగుడుకు అలవాటు పడ్డవారు అసత్యవాదు లవుతారు. సమాజంలో చులకనైపోతారు. మితంగా, మధురంగా మాట్లాడువారు సర్వులకు ప్రేమపాత్రులై భాసిస్తారు. మధురమైన వాక్కు వరం లాంటిది. అతివాగుడు శాపం వంటిది.

సాధకుడు మితంగా భుజించాలి. గాలి ప్రవేశించేందుకు కూడా ఖాళీ లేకుండా కొందరు పొట్టలు నింపుతుంటారు. పెట్టేవాళ్ళకు ప్రేముంటే ఇక చెప్ప నవసరము లేదు. వారు బాధలు పెట్టేవారుగా మిగిలిపోతారు. ఇంక కొంచెము తినగలము అనెడి భావము ఉండగనే భుజించుట మానేయాలి. ఈ సుగుణాన్ని అలవరచుకొన్న సాధకుడే సాధనలో కొనసాగగలడు. కొన్ని రోజులు ఉప్పు, కారము తగ్గించి తింటూ ఉంటే అతిగా భుజించువారు కూడా మితముగా భుజించి హితమెరిగి జీవించగలరు. అలాగని కొందరు దీర్ఘ ఉపవాసాలు చేసి వాడిన తోట కూరలాగా, చిలుకుకు తగిలించిన చొక్కాలాగా వ్రేలాడుతుంటారు. ఇది మరీ చాదస్తం. ఛాందసం. ఆకలితో జీవించడమే ఆధ్యాత్మికజీవనమైతే మన దేశములో సగము జనాభా సాధకులే అవుతారు. అతి ఎప్పుడూ వర్జించదగినదియే గాని వరించదగినది కాదు.

ఆదాయాన్ని బట్టి మితంగా ఖర్చు పెట్టుకోవాలి. ఖర్చును క్రమబద్ధం చేయాలి. అధిక వ్యయానికి అలవాటు పడినవారు. అప్పుల నాశ్రయించి ముప్పును కొనితెచ్చుకుంటారు. అలాగని దారుణంగా దోచడము, దాతృత్వము లేకుండా

దాచడము కూడా సమంజసము కాదు. మంచి అలవాట్లను కలిగి, మితవ్యయము ననుసరిస్తూ, అతివ్యయము లేకుండా జీవించాలి. శీలవంతులను శ్రీనివాసుడే కాపాడుతాడు.

అతిగా ఆలోచించడము కూడా అనర్థమే. కొందరు ప్రతి చిన్న విషయానికి పెద్దగా ఆలోచిస్తుంటారు. కొందరు ఎదురుపడే ప్రతి వ్యక్తిని గూర్చి, విషయాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తుంటారు. ఇది వాస్తవానికి ఆచరించదగిన విధి కాదు. ఆవరించిన మానసిక వ్యాధి. అవసరమైన విషయాలే అంతఃకరణలో కదలాలి. సత్యమైన విషయాలే మననములో కొనసాగాలి. అనవసర, అప్రస్తుత ఆలోచనలను అరికట్ట గల్గినపుడే నీవు సాధనలోని మాధుర్యమును చవిచూడగలవు.

స్నేహము మంచిదే. అతిస్నేహము అవాంఛనీయము. స్నేహితుని ఎక్కువగా ప్రేమించాలి. తక్కువగా కలిసి తిరగాలి. భావప్రాధాన్యమే గాని భౌతిక సంపర్కము అనవసరము. తిరుగుడులో విరుగుడు ఎదురౌతుంది. మనుగడ భారమై నిలుస్తుంది.

సాధకుడు సత్యసంధుడై యుండాలి. ఏదిచ్చినా ఫరవాలేదు. కానీ మాటిచ్చేటప్పుడు ఆలోచించి మరీ ఇవ్వాలి. మాట నిలిచినపుడే మనిషి నిలుస్తాడు. మాట పడితే మనిషి పతనమౌతాడు. మాట చెడితే బాట చెడుతుంది. బాట చెడితే బ్రతుకే పాడౌతుంది. చేయగలిగితేనే చెప్పు. చెప్పిన దానిని చేసి చూపించు. మితమైన వాగ్దానాలు హితకరమని మరువకు. అతిగా వరాలిస్తే భస్మాసురులే ఎదురౌతారు.

సాధకా! సాగిపో! మితములోనే స్థిమితముంది. హితము దాగిఉంది. ఉచిత రీతిలో చరించువారు ఉన్నతులౌతారు. సముచితపంథాలో నడక సాగించువారు సముజ్జ్వల జీవనముతో శోభిస్తారు. అందుచేతనే శ్రీకృష్ణపరమాత్మ

యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా

"మితమైన ఆహారవిహారములు, మితమైన నిద్రయు, మెలుకువయు గలవానికి ఉచితరీతిన కర్మలయందు చరించు వానికి ఈ యోగము దుఃఖహారము అగుచున్నది" అని భగవద్గీతలోని ఆత్మసంయమయోగము నందు తెలిపి యున్నారు.

ఆచరించబడి.....ఆత్మవిదులై శోభించండి.

ప్రణవప్రేమలతో

మీ

స్వామి సుందర చైతన్యానంద

ప్రియాత్మా!

లేఖ 13

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

సాధకునికి సదుపాయాలు అవసరమా? అనుకూల వాతావరణము అవశ్యమా? బాధలు బరువులుగా మిగులుతాయా? బాధ్యతలు భారమై ఉంటాయా? ఆలోచించండి.

అవసరమైన కార్యముపై నీవు గ్రామాంతరము వెళ్తావు. కానీ ఇంటివద్ద అత్యంత అవసరమైన కార్యము నీ కొరకు వేచియున్నదని తంతి వచ్చింది. ఉన్నపళంగా బయలుదేరుతావు. సమయానికి వాహనాలు లేవు. ఆ సమయానికి ఏ వాహనము లభిస్తే దానిలో ప్రయాణం చేస్తావు. సౌకర్యాలు ఉండవు. పైగా అసౌకర్యంగా ఉంటుంది. అయినా పట్టించుకోవు. అది లారీయైనా, ఎద్దుబండి అయినా బాధలేదు. నిలబడి ప్రయాణం చేసేందుకు కూడా మనం వెనుకాడము.

సాధకుని పరిస్థితి అలాంటిదే. ప్రపంచంలో కర్మానుభవమునకై జీవి కాలు మోపాడు. పుణ్యము తోడై భగవంతుని చేరమని తంతి ద్వారా సమాచారమును అందించింది. సాధకుడు నిజగృహానికి తిరుగుప్రయాణం సాగించాడు. పరంధామము వైపు పరుగులిడుచున్నాడు. పరిస్థితి గణనీయమైనది. సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నవా? లేవా? అని ఆలోచించే అవకాశ మివ్వని ప్రయాణ మది. గమ్యం చేరడమే ముఖ్యం. కనుక సాధకుడెప్పుడూ లభించిన దానితో తృప్తి చెందేవాడై యుండాలి.

అవసరముంది గనుక నిలబడియైనా ప్రయాణం చేసేందుకు మనం సిద్ధపడతాము. కొంతదూరము ప్రయాణము చేసేసరికి ఎవరో ఒకరు సర్దుకొని మనకు కూర్చోడానికి స్థలాన్ని కేటాయిస్తారు. మరొకరు కాఫీకప్పు నందిస్తారు. కాలంలో అన్నీ కలిసివస్తాయి. సాధకులైన వారంతా ప్రారంభములో అనేక బాధలతో జీవనగాథల నారంభించినవారే. కృషిలో పండి వారు ఋషులయ్యారు. ఆ తరువాత వారి అవసరాలన్నీ పరమాత్మే తీర్చాడు. ఈ సత్యాన్ని నా జీవితం కూడా ధ్రువపరచింది.

ప్రయాణం చేయడము ముఖ్యం గాని కూర్చున్న స్థలం కాదు గదూ! గమ్యం చేరగానే స్థలాన్ని త్యజించక తప్పదు. ప్రయాణంలో మనము ఆక్రమించిన

స్థలము ఎలా మనది కాదో అలాగే ఇల్లు, పొలము, ధనము, జనము కూడా మనవి కావని గ్రహించి, వాటి మధ్య ఆనందంగా జీవించేవాడే సాధకుడు.

సుఖదుఃఖాలు మనోకల్పితాలు. ఈ సత్యం తెలిసి సాధకుడు సమస్థితిలో జీవించడం నేర్చుకోవాలి. రాత్రింబవళ్ళకు సూర్యుడు కారణంగా తెలిసినా చీకటి వెలుగులు భూమిపై మున్నవారికే గాని సూర్యునిలో రాత్రింబవళ్ళు తెలియవు. అలాగే సాధకుని స్థాయిలో ద్వంద్వాలు సమసిపోవాలి.

"బాధలు చుట్టుముట్టినపుడు నేను చస్తాను" అని కొందరంటుంటారు. ఇదియే అజ్ఞానము. చావు నీ చేతిలో యున్నదా! నీవు అనుకొని మరణించడానికి నీవు అనుకొనే పుట్టావా? అజ్ఞానము అయోమయంగా పలికిస్తూంటుంది.

నీవు సాధకుడవు. పరమాత్మ చట్టాలకు తలవంచి జీవించు. సంకుచితమైన స్వభావాన్ని త్యజించి, దివ్యత్వాన్ని జయించు. స్వర్గనరకాలు ఇక్కడే ఉన్నాయి. నేను చేస్తున్నాననే భావన కదలగానే నరకం ఎదురు నిలుస్తుంది. చేయించే వాడున్నాడని అర్థం కాగానే స్వర్గం నీ ముందు కనిపిస్తుంది.

సాధకులు ఇంద్రియాలకు ప్రభువులే గాని దాసులు కారు. ఇచ్చేవారే గాని పుచ్చుకొనేవారు కారు. నేను, నాది యనెడి అహంకార మమకారములకు స్వస్తి చెప్పి. శాంతియుత జీవనమును సాగించువారే సాధకులు.

వెన్నుని చేతిలో వేణువువలె నీవూ జీవనరాగాన్ని ఆలపించాలి. వాణీ హస్తములలోని వీణవలె నీవూ విజ్ఞానశబ్దాలను పలకాలి. నాగభూషణుని మోసే నందీశ్వరుని వలె నీ మస్తకము జ్ఞానసంపదను మోయాలి. తనను త్రిప్పే మూషికము మాతంగవదనుని ముందు చిన్నదై తిన్నగా యున్నట్లు, నిన్ను నడిపే కోరిక చిన్నదైపోవాలి. విస్తృతం గాకుండా తిన్నగా ఉండాలి.

ప్రయత్నించు.

ప్రయత్నశీలురకు ప్రగతి దూరం కాదు.

ప్రణవప్రేమలతో

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 14

ప్రియాత్మా !

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

అంతరాత్మకు - బాహ్యజగత్తుకు మధ్య నిలిచియున్న మనస్సే బంధమోక్షములకు కారణమగుచున్నది. మనస్సు తన సహజప్రవృత్తిచే ఇంద్రియ విషయములను అనుభవించుటకు బాహ్యానికి పరుగులిడుతూ ఉంటుంది. అవగాహన లేని అయోమయ జీవులకు విషయప్రపంచమే ఆనందకేంద్రమై గోచరిస్తుంది. ప్రభావితులగు ప్రతిభావంతులకు అంతరాత్మయే ఆనందాలయమని బోధపడుతుంది.

సాధకుడు సదా అంతర్ముఖుడయ్యే ప్రయత్నమును వదలకూడదు. వైద్యులు, మందులు రోగికి ఉపయోగపడుతాయి. కానీ రోగియే రోగమును నయం చేసుకోవాలి. బోధలు, బోధకులు ఆధ్యాత్మిక మార్గమును దర్శింప చేయగలరు. కానీ దర్శించవలసినది, గమించవలసినది సాధకుడే.

అంతర్ముఖుడయ్యే సాధకునకు ఆంతర్యము అంధకారముతో నిండి యున్నట్లే గోచరిస్తుంది. ఆ చీకట్ల వెనుకనే అద్భుతమైన వెలుగును విరజిమ్మే పరంజ్యోతి ఉన్నది. మనస్సునకు ముందున్నవాటిని చూసేందుకు ఇంతవరకు అలవాటు పడినాము. లేదా మనస్సుతో కలిసి నడక సాగించుటయే నేర్చియున్నాము. కానీ మనస్సుకు వెనుక నిలిచి మనస్సు ద్వారా చూసే ప్రయత్నము చేయాలి. ఇది దివ్యదృష్టి. ఈ దృష్టి అలవడిన దివ్యాత్ముని లొంగదీయు శక్తి ఈ జగత్తునందెవ్వరికిని లేదు.

విషయవృత్తులు మనస్సులో కదలగానే వాటిని నివారించాలి. ఇది ఎలా సాధ్యము? ఆ వృత్తిని మరచుటయే ఇచ్చట నివారించుట కాగలదు. మరిచేదెలాగు? అంతకన్నను బలీయమైన భగవద్విషయమును గూర్చి చింతించుటయే. సాధనలో దీనిని ప్రతిపక్షభావన యని పిలుస్తారు. ద్వేషభావనను ప్రేమభావనతో జయింపవచ్చు. లోభగుణాన్ని త్యాగధనంతో లొంగదీసుకోవచ్చు. భయాన్ని పారద్రోలుటకు ధైర్యాన్ని ఆశ్రయించినట్లు, విషయవృత్తులను విస్మరించుటకు బ్రహ్మ చింతనమును కొనసాగించాలి.

ఓ మనసా! రాళ్ళతో కొట్టినా, కట్టెలతో బాదినా సిగ్గువిడిచి ప్రజల ఇంటి గుమ్మముల వద్దకు పరుగులిడే శునకమువలె ప్రపంచము చేసిన గాయాలను మరచి, ఆనందమును వాంఛించి, జగత్తులో బిచ్చమెత్తకు. బాధా సుమములను

ఆఘ్రాణించుటకు యత్నించకు. మోహఫలాలను ఆరగించుటకు ప్రయత్నించకు. పేరుప్రఖ్యాతులనే చౌకబారు గుర్తింపులకై గాలించకు. గాలిలా చలించకు. యంత్రమువలె నిర్విరామంగా పరిభ్రమించకు. కోతిలా చంచలమై పరుగులిడకు. అహంకార స్నేహితుని వదలించుకో. క్రోధ బంధువును నీలో ప్రవేశించనీయకు. కామానికి బానిసవు గాకు. వాంఛల వలలో చిక్కకు. ఆత్మస్తుతికి స్వస్తి చెప్పు. పరనిందను పారద్రోలు. నమ్రతను అలవరచుకో. కుళాయి వద్ద జలపానము చేయవలెనన్నచో నడుము వంచక తప్పదు. ఆధ్యాత్మిక మార్గములో ఆనంద రసపానము చేయుటకు నీవు వినమ్రతతో యుండాలి. వినయముతో కూడిన విద్యయే నీకు శాంతిని ప్రసాదిస్తుంది.

వెర్రివానివలె విర్రవీగకు. సదా సంతృప్తితో జీవించే సదలవాటును ఏర్పరచుకో.

A contented mind is a continual feast.

ప్రపంచమంతా ప్రశాంతతలో సాగిపోవాలని ప్రార్థించు. సుఖించేవారిని జూచి ఆనందించే అలవాటును అలవరచుకో. దుఃఖితులను జూచి బాధపడే, సానుభూతిని జూపే, సహాయము నందించే ప్రవృత్తిని కలిగియుండు. రాజుల్ని జయిస్తే నీకు రాజ్యాలు లభిస్తాయి. కానీ నిన్ను నీవు జయించినపుడే నీకు శాంతి లభిస్తుంది. శాంతిలేని సంపదలు శవసౌందర్యములే నని మరువకు.

ఇంద్రియ ద్వారాలను మూసేయ్. హృదయ సింహాసనముపై అధిష్ఠించు. ఆనంద రాజ్యమును అద్భుతముగా పరిపాలించు. అహంకార మంత్రి మాటలను ఆలకించి అన్యాయము గాకు. అన్యాయాలకు అలవాటుపడిన అహంకార అమాత్యుని పదవీభ్రష్టుని గావించు. ఆత్మనిష్ఠుడవైన నీకు ఆ తరువాత శత్రువులు మిగలరు.

ప్రయత్నించు.

ప్రేమతో

మీ

స్వామి సుందర చైతన్యానంద

ప్రియాత్మా!

లేఖ 15

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

నీవు నిర్వికారుడవు. బాధలకు నీలో చోటు లేదు. నీ నిత్యజీవితంలో ఈ సత్యమును మరచుటయే సమస్త దుఃఖములకు కారణమగుచున్నది. వికారము చెందే ప్రపంచము నిర్వికారుడవైన నిన్ను కలతపెట్టలేదు. అనిత్యమైన ప్రపంచానికి నీవిచ్చే అసత్యపు విలువలే నిన్ను కలవరపెట్టి, కలుషిత మొనర్చుచున్నవి.

కదిలే కాలంతో కనుమరుగయ్యే బంధాలన్నిటినీ ప్రయత్నించి మరచిపో. పెట్టుకుంటే అన్నీ బంధాలే. పట్టుకుంటే అందరూ బంధువులే. కలనుండి బయటపడితే అన్నీ కల్లలే.

పెరిగే మమతలే బాధల వలయాలని మరువకు. ఊడినవి ఊడిపోనీ. అంతమాత్రాన నీవు ఓడిపోలేదు. నీ మంచి మాడిపోలేదు. ఈ ప్రపంచములో దేనిని నీదిగా భావించకు. ఈ భావనలు నిన్ను కలలో కూడా సుఖపడనీయవు. "నాది" అని నీవు దేనిని పిలుతువో అది నీ సుఖమును కొంత హరించునని మరచిపోకు. "నావి" అని ఎన్నిటిని పిలుస్తావు? "నా వారు" అని ఎందరిని పలుకరిస్తావు? నా వాళ్ళనెడి సంఖ్య ఎంతగా పెరుగుతుంటే నీలోని సౌఖ్యము అంతగా దూరమైందని భావము.

బాధలు తీరాలని క్రొత్త బాధలను తెచ్చిపెట్టుకోకు. పరులకు బోధల నందించే నిన్ను తృప్తి పరచేందుకు భగవానుడు నీకు బాధలనందిస్తాడు. బాధల నిజస్వరూపము తెలియాలంటే అవి అభిమానుల నుండే రావాలి. ఆత్మీయుల నుండే కదలాలి. అందుకే నీవు నమ్మినవారే నిన్ను నమ్మ చేస్తారు. నమ్మలేని ద్రోహం చేస్తారు.

ఇలా ఎందుకు జరిగింది? అని ఆలోచించకు. నీలో మార్పును భగవానుడు వాంఛిస్తున్నాడనే సత్యాన్ని దర్శించు. గాలిమేడలు నిర్మించుకున్నావు. కూలి పోయాయని జాలి చూపే వారెవ్వరూ లేరు. ప్రేమ యనెడి ఉల్లాకును తగిలించుకొని, దరిచేరిన మోసాన్ని గాంచలేక పోయావు. త్యాగ ముసుగులో చేరువైన స్వార్థాన్ని చూడలేక పోయావు.

కల్మషాలను కరుగనీ, తరుగని నిధి నీలోనే యున్నది. చెదరని ప్రేమ నీ ఆంతర్యములో నిండియుంది. వంచనకు అలవాటు పడిందీ లోకము. విచారించకు.

మాధవుడు నీలోని మంచిని చూస్తూనే యున్నాడు. నిన్ను ఆశీర్వదిస్తూనే యున్నాడు.

అజ్ఞానంతో బరువును తలకెక్కించుకున్నావు. భారము తగ్గించుటకు పరమాత్మ పనిగట్టుకున్నాడు. అర్థం చేసుకో. ఆవేదనకు గురికాకు. అసమ్మతిని ప్రకటించకు. దూరమైన బంధాలన్నీ నిజానికి చేరువైన అందాలే.

ఇచ్చిన వాడికే పుచ్చుకొనే హక్కు ఉంది. నీ జీవితంలో దరిజేరిన సుఖాలన్నీ భగవానుడు ప్రసాదించినవియే. ఒకవేళ అవి దూరమైతే ఏం జరిగింది? ఇచ్చినవాడే తిరిగి పుచ్చుకున్నాడు. ఇది ధర్మం. అవగతమైన ధర్మం బుద్ధిలో ఆవేదనను దించదు. అందుకున్నది సుఖము. అందించునది శుభము.

"నావి" అనుకున్నవేవీ నీవి గావు. ఇది నిజం. చేదుగానే యుంటుంది. అయినా చేరదీసి చూడు. చేయూత నిచ్చి నిన్ను రక్షిస్తుంది. చింతలను అదృశ్యం చేస్తుంది. పిచ్చివాడా! మిణుగురుపురుగుల కాంతిలో ఏ గ్రంథాన్ని చదువుతావు? స్వార్థపరుల నీడలలో ఏ అనురాగపు మేడను నిర్మించుకుంటావు?

"నావి" అని ఈరోజు ఎగురుతావు. "నావి" దూరమైనవని రేపు ఏడుస్తావు. నీవైతే నిన్నెందుకు వదుల్తాయి? వదిలే వాటిని విదిలించుకో. వదలనిదేదో తెలిసి తగిలించుకో. తరించే ముందు తారసిల్లేవన్నీ తరలింపులే. ఉద్ధరింపబడే సమయ మాసన్నమైనపుడు ఊడేవన్నీ ఊరేగింపులే.

మహామహులంతా మట్టిలో కలిసిపోయారు. రాజభవనాలన్నీ రాతిగుట్టలయ్యాయి. కనుమరుగయ్యే వాటి కొరకు కలవరించకు. నిత్యమైన సత్యరూపుడు భగవానుడొక్కడే. అర్థంగాని సత్యం వ్యర్థమైన బంధాలను తగిలించింది. అవగతమైన సత్యం వెతలను అంతమొందిస్తుంది.

జరిగేదంతా నాటకం.......

వీక్షించుటే మన పాటవము.

ఈ విచిత్ర జగన్నాటకంలో

సాక్షి కాగోరే ప్రేక్షకుడు

స్వామి సుందర చైతన్యానంద

ప్రియాత్మా!

లేఖ 16

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించాలంటే ముందుగా నిన్ను నీవు శుభ్రం చేసుకోవాలి. మనస్సును పవిత్రం చేసుకోవాలి. అనుచితమైన అలవాట్లను దూరం చేసుకోవాలి. సుగుణాలరాశివి కావాలి. నారాశివి కావాలి.

అందాన్ని వీక్షించడము అందరికి ఆనందమే. అందమెక్కడుంది? అందరిలోనూ ఉంది. కల్లోల కెరటాలను అధిగమించి పయనిస్తే ప్రశాంత ఉదధి దర్శన మిస్తుంది. దేహమనోబుద్ధులను దాటి నడక సాగిస్తే సౌందర్య సార సర్వస్వం అనుభవానికి అందుతుంది.

అందాన్ని ఎవరు ఏవగించుకుంటారు? ఆనందాన్ని ఎవరు ద్వేషిస్తారు? అందరిలో ఉన్నది సౌందర్యమేనని, సౌకుమార్యమేనని తెలిసినపుడు నీవు ఎవరినీ ద్వేషించలేవు. బాధించలేవు. ద్వేషభావము దుఃఖానికి హేతువవుతుంది. సాధకా! ఎవరినీ ద్వేషించకు.

మంచిది. నీవు ఎవరినీ ద్వేషించుటలేదు. కనుక నీవు చెడ్డవాడవు కాదు. నీలాగే గాయి ఎవరినీ ద్వేషించుట లేదు. చెట్టు ఎవరినీ దూషించుట లేదు. అవికూడా చెడ్డవి కావు. మరి నీవు గాయిలాగా, చెట్టులాగా జీవిస్తావా? మరైతే పరమాత్మ మనోబుద్ధులను నీకెందులకు ప్రసాదించినట్లు?

ద్వేషపరులు దోషులు. దానవులు. కనుక ద్వేషాన్ని దూరం చేసుకోవాలి. మనం మానవులం. ప్రేమించే శక్తి గలిగినవారము. ఆ పని చేస్తున్నామా? లేదా? ఆలోచించు, కబీర్ నుడివినట్లు "ప్రేమరహిత హృదయము భయంకర శ్మశానము.'

సర్వులలో సర్వేశ్వరుని దర్శించు. అప్పుడే సర్వులను నీవు ప్రేమించగలవు. వ్యక్తిని చూచే అలవాటు ప్రమాదము. వాసుదేవుని దర్శించే అనుభూతి ప్రమోదం. ఒకవేళ వ్యక్తిలో వాసుదేవుని నీవు చూడలేనిలో పరవాలేదు. వ్యక్తిలో తెలియని వాస్తవాన్ని ఊహలో దర్శించు. నేటి పాపికే రేపు పుణ్యాత్ముడయ్యే అవకాశముంది అని భావించు. ఆ వ్యక్తి పై నీకు గౌరవ మేర్పడుతుంది. నేటి పాపికి, ఒకనాటి పుణ్యాత్మునికి మధ్య నిలిచియున్నది కాలమేనని గ్రహించు. కాలము ఊహాజనితమని భావించు. నీ మనోజనితమేనని సంభావించు. అంతే. కాఠిన్యమంతా కరగిపోతుంది.

మనస్సులోని భావాలే దేహం ద్వారా కర్మలుగా వ్యక్తమవుతుంటాయి. ఏ విషయంలోను పూర్తిగా మంచి నిండదు. పూర్తిగా చెడు ఉండదు. మంచిచెడులు మనోకల్పితాలు. ప్రతి మనిషి తన దృక్కోణం నుండి తనకు తాను మంచిగానే కనబడుతుంటాడు. మంచిచెడులను ఏకరువు పెట్టుకుంటూ జీవిస్తే బ్రతుకులో శాంతి మిగలదు. సుఖం నిలువదు. నీ ఆలోచనలను నడిపే చైతన్యదీప్తి మనస్సులో ఎక్కువ కాలము స్ఫూర్తివంతమై నిలచినపుడు అట్టి మనస్సులో విలువైన ఊహలు, విశాల భావాలు కదుల్తాయి. మనసులో అజ్ఞానాంధకారము దట్టమైనపుడు మన ఊహలు నీచంగా ఉంటాయి. భావాలు సంకుచిత మవుతాయి.

విశాలహృదయం కలవానిలో ద్వేషాలుండవు. దోషాలుండవు. ద్రోహాలుండవు. మోహాలుండవు. దుష్టవృత్తులు గల మనస్సు సదా నీకు శత్రువే. దొంగలు లేనిచోట హాయిగా జీవించవచ్చు. దోమలు లేనిచోట ప్రశాంతంగా నిద్రించవచ్చు. దోషవృత్తులు లేని హృదయం క్షీరసాగరమే. అట్టి హృదయాన్ని పొందగలిగితే నీవూ శాంతాకారమే అవుతావు.

పామరితనాన్ని పారద్రోలు. సదా హరినామామృత పానం చేసే సదలవాటును కలిగియుండు. కాలికి బురద అంటుకోగానే కాళ్ళు కడుగుకొనునట్లు, మనస్సులో ద్వేషభావాలు స్ఫురించగానే భగవన్నామంతో మనస్సును శుద్ధి చేసుకో. నీవు సదా శాంతితో జీవిస్తావు.

మనస్సును మందిరంగా మార్చుకో. దేవుడులేని గుడి దయ్యాలకొంప. మాధవుడు లేని నీ మనస్సు మందిరమెలా అవుతుంది? మాధవుడు మనస్సులో ఉండాలంటే మాధవ నామామృతపానమే ఏకైక మార్గమని మరచిపోకు. నామామృతం నిలిచియున్న మనస్సులో ద్వేష విషం నిలువలేదు.

ద్వేష విషాన్ని క్షాళనం చేయాలి.....ప్రేమామృతాన్ని పానం చేయాలి.

ఏదైనా చేయాల్సిందే......

ఏదీ చేయకుండా పొందగలిగేది మృత్యువొక్కటే..........

ప్రేమసాగరంలో
చిటు తరగ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 17

ఆత్మబంధువులారా!

హరి: ఓం.....ఓం నమో నారాయణాయ

స్నేహ మనునది ప్రతివ్యక్తికీ సామాన్యము, స్పృహణీయము. జీవితములో వ్యక్తి యత్నించి పొందదగిన జీవనమణియే స్నేహము.

సమానధర్మములు గలవారి మధ్య సఖ్యము సాధ్యము. ఇది సాధారణ విషయము. కొన్ని సమయాలలో, సందర్భాలలో అపరిచితుల మధ్య కూడా స్నేహము సాధ్యమవుతుంది. అప్రయత్నంగా స్నేహము లభిస్తుంది. ప్రయత్నము లేకనే మిత్రులు దొరకునట్లు, కొన్ని సమయాలలో ప్రయత్నము లేకుండా శత్రువులు కూడా లభిస్తారు. జీవనరీతిని బట్టి జీవనమాధుర్య ముంటుంది.

నీ స్నేహితుడు నీకు ప్రియంగా గోచరిస్తాడు. ఇది సామాన్య విషయం. నీ మిత్రునికి మిత్రుడు నీకు తెలియకపోయినా పరోక్షంగా నీకు మిత్రుడవుతాడు. నీ భావాలకు అతని భావాలకు పొంతన లేకపోయినా నీ మిత్రునికి మిత్రుడగుటచేత నీకూ మిత్రుడౌతాడు. అది సర్వులకు అర్థమయ్యే సామాన్య విషయము.

మిత్రుని మిత్రుడు మనకూ మిత్రుడౌతాడు. కానీ మన శత్రువు యొక్క శత్రువు మనకు శత్రువు కాడు. పైగా మిత్రుడౌతాడు. ఇక్కడే మనం కాస్త ఆలోచనలను కదలించాలి. నీ శత్రువునకు అతడు శత్రువగుట వలన మీ ఇరువురి మధ్య సమానధర్మములు లేకపోయిననూ అతడు నీకు మిత్రుడౌతాడు. కర్ణ దుర్యోధనుల భావములలో సామ్యము లేకున్నను దుర్యోధనునకు శత్రువైన అర్జునుడు కర్ణునికి శత్రువగుటయే కర్ణ దుర్యోధనుల మిత్రత్వమునకు కారణమైనది.

ఇచ్చట మనము ముఖ్యంగా రెండు విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. (1) నా స్నేహితుని శత్రువు నాకూ శత్రువేనా? (2) నా శత్రువు యొక్క మిత్రుడు నాకు మిత్రుడు కాగూడదా? ఈ ఆలోచనలు కొన్ని ఆసక్తికరమైన జీవనరీతులను మనకు దర్శింప చేస్తాయి.

నా మిత్రుని శత్రువుపై నేను శత్రుత్వం వహింపగనే నా మిత్రుడు ఆనందంతో పొంగిపోతాడు. అలాగాక అతనిపై నేను ప్రేమను పెంచుకొని సఖ్యము చేసినచో నా మిత్రుడు బాధ పడతాడు. అంతేకాదు. నన్ను విస్మరించే ప్రమాదము కూడా కలుగవచ్చును.

సాధారణంగా స్నేహము ప్రారంభము కాగానే అప్రయత్నంగా స్నేహితులు ప్రమాణాల పర్వాన్ని సాగిస్తూంటారు. "మిత్రమా! ఈ క్షణము నుండి మనము స్నేహితులము. మన మధ్య స్నిగ్ధమే గాని స్పర్ధలుండవు. మన స్నేహము జీవితాంతము వరకు ఇలాగే ఉంటుంది. నిన్ను నేను ఎట్టి పరిస్థితులలోను కష్టపెట్టను."

బాగుంది. నీవు నీ మిత్రుని కష్టపెట్టవు. కానీ అతడే కష్టాలను పరిస్తే? అప్పుడు నీవేమి చేయగలవు? కనుక దీనిని కూడా దృష్టిలో ఉంచుకొని ప్రమాణాలను పరమాన్నంలో అతిముఖ్యమైన పంచదారలాగ ఒక విషయాన్ని కలుపుకోవాలి.

"మిత్రమా! నిన్ను నా ప్రాణసమానంగా భావిస్తాను. అంతేగాదు. నీ కొరకు నా ప్రాణాన్నైనా అర్పిస్తాను. నా స్నేహాన్ని నీవు కాంక్షించు. కానీ నీ శత్రువుతో నా శత్రుత్వాన్ని ఆకాంక్షించకు. ఇది మన స్నేహ ఆరోగ్యానికి అంత మంచిదికాదు. నేను నిన్ను ప్రేమిస్తాను. నీ శత్రువును కూడా ప్రేమిస్తాను. శత్రువులైన మీ ఇరువురికి నేను మిత్రుడగుట వలన మీలోని స్పర్ధలను పోగొట్టి స్నిగ్ధము నేర్పరచే అవకాశమునకు నోచుకోగలను. మిత్రత్వము లాలిపాడి నిద్రపుచ్చుతుంది. శత్రుత్వము తట్టి లేపి జాగరణము చేయిస్తుంది."

ఈవిధంగా కుదిరిన ఒడంబడిక నిన్ను ఒంటరి వానిని చేయదు. నీ మిత్రుని శత్రువుని నీవు ప్రేమించినను నీ మిత్రునితో నీ స్నేహము భగ్నం కాదు.పైగా వారిరువురిని నీవు ఏకం చేయగలిగితే మీరు ముగ్గురు మిత్రులవుతారు. ఒకవేళ వారిరువురి మధ్య నిలిచియున్న అపార్థాలను తొలగించలేనిచో తటస్థ విధానము నవలంబించవచ్చును. అంతమాత్రాన ఎవరితోనూ నీ స్నేహము భంగము కాదు. భగ్నము కాదు. నీ మిత్రుని శత్రువుతో నీవు శత్రుత్వమును వహింపలేవని నీ మిత్రునికి ముందే తెలుసును గనుక అతడు నిన్ను మరోవిధంగా భావింపడు. ఒకవేళ నీవు వారిరువురిని కలుపవచ్చును. అంతటి శక్తి నీకు లేనిచో నీవు తటస్థముగా యుండవచ్చును. కష్టాలు, నష్టాలు ఇచ్చుట వాటిల్లే అవకాశము లేదు.

ఈ సందర్భములో నా చిన్నతనాన జరిగిన ఒక సంఘటన నాకు గుర్తుకు వచ్చుచున్నది. నా మిత్రుని, నామిత్రుని శత్రువైన నా మరియొక మిత్రుని నేను ఒకటి చేయబూని ఆ ప్రయత్నములో వారిరువురికి దూరమై నేను ఒంటరివాడ

నయ్యాను. ఇద్దరినీ పోగొట్టుకున్నాను. మంటతోనే వంట తయారవుతుంది. మంట ఎక్కువైతే వంట చెడిపోతుంది.

ఇక రెండవ విషయం. నా శత్రువు యొక్క మిత్రుడు నాకు శత్రువు కావలిసిందేనా? అవసరం లేదు. నా శత్రువు యొక్క మిత్రులను నేను శత్రువులుగా పరిగణింప నవసరము లేదు. మనస్సును సంస్కరించుకుంటే అందరూ మిత్రులే. పుట్టుకతో మనకు శత్రువు లెవరు? అవగాహన లోపించినపుడు శత్రువులు మొదలయ్యారు. అవగాహనతో చరిస్తే అందరూ బంధువులే.

శత్రువునే శత్రువుగా భావించకూడదు. ప్రయత్నముతో శత్రువును కూడా మిత్రుడుగా మలచుకోవాలి. శత్రువే శత్రువు గానపుడు శత్రువు యొక్క మిత్రుడు నీకు శత్రువెలా అవుతాడు? నీకు అవగాహన కుదిరింది గనుక నీవు సరిపెట్టుకుంటున్నావు. మరి నీ శత్రువు యొక్క మిత్రుడు నిన్ను మిత్రుడుగా అంగీకరించుటకు సమ్మతించకపోతే, -- నీ మిత్రత్వాన్ని నిరాకరిస్తే, అప్పుడేమి చేయాలి? తటస్థవైఖరి నవలంబించాలి. నీ బలహీనతలను నీవు పోగొట్టుకొంటే చాలు. ఇతరుల బలహీనతలకు నీవు నీరసింప పనిలేదు.

దయ, ప్రేమ, క్షమాది గుణములు నిండిన హృదయంలో పరమాత్మ వసిస్తాడు. భగవంతునితో నీకు మైత్రి కలిగినచో సమస్త ప్రపంచముతో నీకు మైత్రి సిద్ధిస్తుంది. పరమాత్మ నీకు మిత్రుడు కానిచో అన్నిచోట్ల నీకు శత్రువులే అగుపిస్తారు. వెలుగున్నచోట చీకట్లు లేనట్లు, ప్రేమున్నచోట ద్వేషాలు అంకురించవు. ప్రేమ హృదయగతం. సంశయాలు బుద్ధిగతం.

అందరినీ ప్రేమించు. ప్రేమించలేని నిర్భాగ్యులను క్షమించు.

నీ వెవరినీ బాధించకు. బాధించే వారి వలలో పడకు.

మిత్రత్వము దైవలక్షణం. శత్రుత్వము అసురజీవనం.

సజ్జనసేవలో

సదా

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 18

ఆత్మబంధువులారా!

హరి: ఓం.....ఓం నమో నారాయణాయ.

సంపద గలవారు సంపన్నంగా ఎందుకు జీవించలేక పోతున్నారు? వారికి డబ్బు ఉంది. బంగళాలున్నాయి. కార్లున్నాయి. ఖాతాలున్నాయి. అంతేకాదు, కోరికలూ ఉన్నాయి.

కోరికలు కదలనంత వరకు అందరూ భాగ్యవంతులే. కోరికలు కదలిన క్షణాన అందరూ బిచ్చగాళ్ళే. ఎన్ని ఉండినా ఏదో లేదనే బాధతో అలమటించే వారే.

నీకన్నా ఎక్కువ సంపాదన కలిగిన వారితో పోల్చి చూసుకోకు. నీకన్నా తక్కువ సంపాదన గలవారిని గాంచి, నిన్ను భగవంతుడు అనుగ్రహించాడని భావించి, ఆనందించు. సంపాదన ఇవ్వలేని సుఖాన్ని సంతృప్తి అందిస్తుంది. ఇది నా అనుభవం.

నేను ఒక గ్రంథాన్ని శ్రద్ధాభక్తులతో రచిస్తున్న రోజుల్లో నా వద్ద ఐదువందల రూపాయలే ఉండినవి. ఈ గ్రంథాన్ని ముద్రించాలంటే మూడువేల రూపాయలు కావాలి ఆ రోజుల్లో. ఈ డబ్బెలా సమకూరుతుంది? అనే ఆలోచన రచనా మార్గంలో కంటకమై నిలిచింది. చాలా వ్యథ చెందాను.

ఒక వ్యక్తి నా వద్దకు వచ్చాడు. అతని బాధలను వినిపించాడు. సహాయాన్ని అర్థించాడు. అంతే. నావద్ద నున్న ఐదువందలు అతని చేతుల్లో పెట్టి నా రెండుచేతులు జోడించాను. ఇక గ్రంథముద్రణ అనే ఆలోచనే మాయమైనది. అంతా భగవత్కృపయే; ఈశ్వరేచ్ఛయే అనిపించింది. ఆ క్షణం నుండి గ్రంథ రచన నిరాటంకముగా సాగింది. గ్రంథము పూర్తయిన మరునాడు భక్తురాలైన ఒక అమ్మగారు నా వద్దకు వచ్చారు. వెళ్తూ ఐదువేల రూపాయలు నా చేతిలో ఉంచి వెళ్ళారు.

ఆమెకు గ్రంథము యొక్క విషయమే తెలియదు. డబ్బు నాచేతిలోనే ఉంది. కానీ నా నేత్రాలు ఆనందబాష్పాలతో నిండిపోయాయి. వెంటనే గ్రంథాన్ని అచ్చొత్తించాను. ఆ గ్రంథమే "సాధన పంచకం."

జై జై వాసుదేవ హరి.

అవధి తెలియని కృపానిధి
చరణ కమలముల చెంత
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 19

ఆత్మబంధువులారా!

హరి: ఓం......ఓం నమో నారాయణాయ

చేదు బ్రతుకును భరించడం ఎవరికైనా కష్టమే. తీపి చేదులనేవి ఎక్కడ నుండి సంప్రాప్త మవుతున్నాయి? అవి వ్యక్తిలో ఎలా చోటు చేసుకుంటున్నాయి? బయట నుండి వస్తున్నాయా? లేక అంతర్యంలో జనిస్తున్నాయా?

బాహ్యంలో చేదుండినా, ఆ చేదును చూసే మనస్సు మనవద్ద లేనపుడు చేదు-చేదుగా తెలియదు. భరించలేని చేదును మనస్సులో దించుకొనినదెవరు? మనస్సే. మనస్సులో చేదు ఎందుకు ప్రవేశించింది? తీపి లేకపోవుటచేత.

మధుర మంటే ఎవ్వరికైనా ఇష్టమే. తీపిని వాంఛిస్తారే గాని తియ్యగా జీవించలేరు. మధురపదార్థము చుట్టూ ఈగలు చేరినట్లు, మాధుర్య జీవనము గలవాని చుట్టూ మనుజులు చేరుతారు.

సత్త్వగుణము వృద్ధి చెందితే వ్యక్తిలో సౌకుమార్యం జనిస్తుంది. సున్నితత్వం పెరుగుతుంది. నమ్రత పెనవేసుకుంటుంది. నాణ్యత గోచరిస్తుంది. ఇది మన బ్రతుకులలో మాధుర్యాన్ని పెంచుతుంది.

మధురభాషణము గలవారు ధన్యజీవులు. సర్వులను తమ వైపునకు ఆకర్షించుకుంటారు. పలుకు తియ్యగా ఉండాలి. అది పలుకులోని తీపి. చూపు చల్లగా ఉండాలి. అది చూపులోని తీపి. ఇతరులను నొప్పించకుండా సేవ చేయాలి. అది సేవలోని తీపి. ప్రవర్తన సౌమ్యంగా ఉండాలి. అది ప్రవర్తనలో తీపి.

కొందరు చల్లగా, హాయిగా భక్తితో కీర్తనలు పాడుతారు. అది గానంలో తీపి. కొందరు పాడుతుంటే పిండిమిల్లు ప్రక్కన యున్నట్లే ఉంటుంది. ఎవరికైనా వీరి పాటలు చేదుగానే ఉంటాయి.

మాటలు పరుషంగా ఉండకూడదు చల్లగా ఉండాలి. అందరి హృదయాలు ఈనాడు గాయాలతోనే నిండిఉన్నాయి. నీ పలుకులు వారి గాయాలపై నవనీతాన్ని పూసినట్లు ఉండాలి. కారం చల్లినట్లు ఉండకూడదు.

మనిషి రాగానే చల్లగా చూడాలి. మెల్లగా పలకరించాలి. ఎవరు ముందు పలకరించాలి? అని ఆలోచించడం తప్పు. నీ బ్రతుకులో తియ్యదనం రావాలంటే, కావాలంటే ముందుగా నీవే మాట్లాడాలి. పూర్వభాషియే మధురభాషి యని మరువ కూడదు.

నా మాటలు రోకటితో దంచినట్లున్నా, నా మనస్సు మాత్రము చాలా మంచిది, వెన్నలాంటిది అని కొందరు చెబుతుంటారు. మనస్సు అంత మంచిదైనపుడు మాటను కూడా మంచిగా నడుపుకుంటే ఎంత బావుంటుంది? నీ మనస్సు మంచిదైనా మాట మంచిగా లేనందున మనస్సుకు, ఆ మనస్సును కలిగిన మనిషికి కూడా అగచాట్లు తప్పుట లేదు.

పని కులుకే కాదు మంచి పలుకు కూడా ఉండాలి. కొందరు తిడుతూ పెడుతుంటారు. తినేవాళ్ళు తింటూ తిడుతుంటారు. ప్రేమలేని వినియోగము వాస్తవానికి శనియోగమే. మనోరోగమే. ప్రేమలేని కానుకలు ఎవ్వరికీ రుచింపవు ప్రేమయే నిజమైన కానుక.

సదా అనంత ప్రేమసాగరంలో

చిఱు తరగ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 20

ప్రియాత్మా!

హరిః ఓం.....ఓం నమో నారాయణాయ.

త్యాగము లేనిదే అమృతత్వము సిద్ధించదు. త్యాగము యొక్క పూర్ణస్వరూపమే సన్యాసము. త్యాగ మనగా వదలుట యని అర్థము. చక్కగా వదలగలిగితే సన్యాస మవుతుంది. అలాగని ఉన్న ఆస్తిని, భూమిని, సంపదను త్యాగం చేయటం సన్యాసమని భ్రమించకూడదు. అనంతరూపుడైన పరమాత్మను ఆలింగనం చేసికొని దివ్యానుభూతినొందే ప్రయత్నములో అడ్డు నిలిచే అజ్ఞాన రూపాలను, భావాలను వదలుటయే నిజమైన త్యాగము.

సంసారాలను త్యజించి కొందరు సన్యాసమును స్వీకరిస్తారు. సంసారము వారికి దూరమౌతుంది. కానీ సంసారాన్ని దూరం చేసుకున్నాననే భావన దగ్గరే యుంటుంది. అందుచేత వారి సన్యాసము మెడలో గుదిబండలా ఉంటుంది. మరీ మోయలేని స్థితిలో ప్రక్కన బెట్టే పరిస్థితి ఉంటుంది. ఈ సందర్భాలలోనే బ్రతుకు ప్రక్కకు నెట్టబడుతుంది.

ప్రపంచములో ఏదీ నిన్ను పట్టుకోకుండా ఉండాలి. వాటేసుకున్న దేదైనా కాటేసే వెళ్తుంది. కాచియుండుటయే మన పని, కాపలాకాయుటయే మనదైన పని. బాహ్యము నందలి సంసారము ఎవరినీ బాధించదు. మనస్సులో కదిలే సంసారమే మారణహోమాన్ని తయారు చేస్తుంది. తనకు లేనిదానిని ఆశించేవాడు ఎలా దుఃఖపడుతాడో, తనకున్న దానిపై మమకారమును వీడినవాడు అలా సుఖపడుతాడు.

కొమ్మల నెన్నిటిని ఛేదించినా మొదలు జీవంతో ఉంటే చాలు. కొమ్మలు వాటంతటవే కదుల్తాయి. మొదలును కూడా పెకలించాలి. దేనినైనా త్యాగం చేయవచ్చు. సమస్త బంధాలను ఛేదింపవచ్చు. కానీ దేహాత్మభావమనే మొదలును ఛేదింపనిచో సమస్త త్యాగాలు వృథా అవుతాయి. నేను దేహమనెడి భావనను విస్మరించి, సచ్చిదానంద రూపమైన ఆత్మనే నేను యనెడి భావము స్థిరపడనంత వరకు మన మాచరించే త్యాగాలేవీ సన్యాసానికి సోపానాలు కాజాలవు.

విద్యుచ్ఛక్తిని వదలి బల్బులో కాంతిని ఊహించలేము. ఆత్మను వదలి దేహములో కర్మలను గాంచలేము. మన జననము, జీవనము, మరణము అన్నీ ఆత్మయందే జరుగుచున్నవి. దానిని గుర్తించి గ్రహించుటయే మనము చేయవలసిన కార్యము. ఆత్మను ఎక్కడ నుండియో తెచ్చి,హృదయం లో కూర్చో బెట్టి తాళం

వేయాలనుకోవడం శుద్ధ పొరపాటు. మన అంతర్యంలో సదా భాసించేదే ఆత్మ. అలా గ్రహించుటయే జ్ఞానము. ఈ జ్ఞానము మనకు కలిగితే చాలు. ఆ క్షణము నుండి మనము ఆనందస్వరూపులము కాగలము. మన శాంతిని ఎవ్వరూ భగ్నం చేయలేరు. రేపు అనెడి ఆలోచన ఉదయించదు. సంకల్పసుడిగుండ మేర్పడని నిత్యానంద రసప్రవాహము అంతర్యంలో ప్రవహిస్తుంది. అనుక్షణము ఆత్మయే దర్శనీయ మవుతుంది. ఇచ్చట యత్నము ఉండదు. ప్రయత్నము తెలియదు. ప్రమోదమే ప్రశస్తమై యుంటుంది.

విన్నంత మాత్రాన జ్ఞానం కలుగదు. అంతర్యంలోని అయోమయ ఘోష వినపడకుండా తగు జాగ్రత్తలు తీసికొనినపుడే లబ్ధి కలుగుతుంది. సభలు నిర్వహించినంత మాత్రాన శాంతి లభించదు. నిర్వాహకులు తమలోని అహంకార నిర్వాకమును వదలలేక శాంతి పేరుతో అశాంతి సభలనే నిర్వహిస్తున్నారు. అంతర్యంలో అవగాహన పెరగాలి. నిరంతరం ఆత్మధ్యానము కొనసాగాలి. దేహచింత దూరమై దైవచింత చేరువు కావాలి. ఇదియే త్యాగము. ఇదియే సన్యాసము.

పెరిగే దేహము ఒకనాడు కరగిపోతుంది. శ్మశానంలో తరగిపోతుంది. అరగిపోయే వాటిలో అందమేముంటుంది. అరగని రూపం, ఆరని దీపం అంతర్యంలో దర్శింపబడాలి. దేహమనెడి పరికరము అందుకే ఉపయోగపడాలి. అనువుగానిచో తనువు నెందుకు పెంచినట్లు?

ఇందుకా యీ తనువును బెంచిన ॥దిందుకా॥

నీ సేవకు లేక నీదు చెంతకు రాక

ఆస దాసుడై అటునిటు తిరిగే ॥టందుకా॥

నీవాడను పేరు నిందు వహింపక

నావాడని యముడు నవ్వుచు బాధించే ॥టందుకా॥

అని త్యాగరాజస్వామి వినిపించాడు. త్యాగానికి అలవాటు పడిన ఆధ్యాత్మిక చక్రవర్తు లందరూ ఈ సత్యాన్నే వినిపిస్తారు. అనేవాడు వినినవాడై యుండాలి. వినేవాడు ఒకనాడు అనగలగాలి.

వినికిడిలో

వినీతుడు

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 21

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

ధనార్జనకై మాతృదేశాన్ని వదలి కొందరు విదేశాలకు వెళ్తుంటారు. అక్కడ కొంతకాలము జీవిస్తారు. ధనాన్ని ఆర్జిస్తారు. కాలం విపరీతమైంది. అక్కడ వసించేందుకు పరిస్థితులు అనుకూలించలేదు. యుద్ధము ఆరంభమైనదా దేశంలో. స్వదేశానికి తిరిగి ప్రయాణమయ్యేందుకు సిద్ధమౌతారు. చాలా ధనాన్ని ఆర్జించారు. ఆ ధనాన్నంతా మూటగట్టుకొని స్వదేశానికి వెళ్ళాలనుకుంటారు. కానీ ఏమి ప్రయోజనం? విదేశీద్రవ్యం స్వదేశంలో మారదు. ఆ ధనాన్ని తెచ్చిపెట్టుకొని సాధించే దేమియును ఉండదు.

ఒక వైపు విదేశంలో క్షణం నిలిచే అవకాశము లేదు. మరొకవైపు లక్షాధికారి బిచ్చగాడై తిరిగి రావాలి. ఆ సమయంలో ఒక వ్యక్తి వచ్చి, "అయ్యా! మీ దేశంలో చెలామణి అయ్యే ధనం నావద్ద ఉంది. నీ వద్దనున్న పైకమును పుచ్చుకొని మీ దేశ ద్రవ్యమును ఇచ్చెదను" అని చెప్పినచో ఎలా ఉంటుంది? ఆ క్షణాన అతని ఆనందానికి అవధులు లేవు. మారకద్రవ్యము లభించనిచో ఆ క్షణమే కాదు. జీవితమంతా ఆవేదనారూపమై మిగుల్తుంది.

మన మీ లోకానికొచ్చాము. ఎన్నో కర్మ లాచరించాము. ఒకనాడు ఈ లోకాన్ని వదలిపెట్టక తప్పదు. విత్తము, వనితలు సర్వులూ ఇచ్చటే యుండగా మనము ఒంటరి ప్రయాణము చేయవలసి వస్తుంది. ఇలాంటి పరిస్థితులలో మన మీ ప్రపంచంలో ఆర్జించిన స్థూల ధనము నిష్ప్రయోజన మగును. ఇది పరలోకములో ఉపయోగపడాలి యన్నచో దానిని ధర్మరూపముగా మార్చుకోవాలి. అలా మారకద్రవ్యము నొసంగి జీవులను తృప్తిపరచువారే మహాత్ములు.

మహాత్ముల మాటలను ఆలకించాలి. వాటిని ఆచరించాలి. ధర్మాచరణము లేకపోవుటకు, దైవస్మరణము కలుగకపోవుటకు కారణము ఒక్కటే. మనస్సు విషయవాసనామగ్నమై యుండుటయే. ఈ విషయసాంగత్యమును మనస్సుకు దూరం చేయాలి. అలా జరుగవలె నన్నచో బుద్ధికి వివేకవైరాగ్యాదులు అలవడాలి. శబ్దాది అనిత్యవిషయాల నుండి నిత్యసుఖము లభ్యము కాదనియు, అట్టి సుఖము పరమాత్మ నుండియే లభ్యమగు ననియు మనస్సుకు తెలిసిరావాలి.

అనేక జన్మలలో ఈ మనస్సు విషయసుఖాల వెంట పరుగిడింది. దొంగబుద్ధి అంత సులభంగా మారదు. ఆ మనస్సుకు సత్యాన్ని బోధించాలి. ఈ ప్రపంచంలో సుఖమనేదే లేదనే వాస్తవాన్ని మనస్సుకు పట్టించాలి. వరుసగా వచ్చే రెండు దుఃఖాల మధ్య తెలిసే విరామమే సుఖంగా పిలువబడుతున్నదనే విషయాన్ని తెలియజేయాలి. ఎరను మ్రింగాలని చేప పరుగిడుతుందే గాని అది తన జీవితాన్నే సమాప్తి చేస్తుందని ఊహించలేదు. విషయసుఖా లిలాగే యుంటాయి. మెరుపు లాంటి సుఖాలిచ్చే పిలుపు నందుకొని బ్రతుకును వమ్ము చేసికోగూడదు.

మంటగలిసే రోజు వెంట రాలేని వస్తువులన్నీ బ్రతికే రోజుల్లో తుంటరులవలె వెంబడిస్తాయి. వీడిపోవుట అనివార్యమనెడి సత్యాన్ని ప్రతిక్షణం చెబుతూనే యుంటాయి. జీవించినపుడు దూరమైతే, "అయ్యో! నన్ను విడచి వెళ్ళినవే?" అని బాధపడుతాము. మరణసమయమున "అయ్యో! నేను అన్నిటినీ విడచి వెళ్తున్నానే?" అని దుఃఖిస్తాము, వస్తుసంయోగంలో ఏవిధంగా చూసినా దుఃఖం తప్పడము లేదు.

ఈ సత్యము నెరిగి జీవించాలి. ధర్మంగా జీవిస్తూ, భక్తితో వసిస్తూ, విషయ సంగమము లేకుండా, మనగలిగితే ఈ ప్రపంచంలో మనం ఆర్జించిన సంపదనంతా ఒక్క పెద్దనోటుగా మార్చుకొని ఊర్ధ్వలోకాలకు వెళ్ళవచ్చు. ఉన్నతగతిని సాధించవచ్చు.

విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాం శ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి

"ఏ మనుజుడు సమస్తమైన కోరికలను త్యజించి, వానియందు స్పృహలేనివాడై, మమకార అహంకారములను విడనాడి చరించునో అట్టివాడు శాంతిని పొందుచున్నాడు" అని శ్రీకృష్ణపరమాత్మ గీతలో తెలిపియున్నారు.

మనస్సులో ప్రపంచ ముండుటవలన శాంతి రాదని అనేక జన్మలతో పాటు ఈ జన్మ కూడా తెలుపుచున్నది. బుద్ధిలో పరమాత్మ నుంచుకొనినవారు అశాంతికి గురికారు. పరమశాంతిని అనుభవించి తరించగలరు.

నిజమో? కాదో? ఎవరినో పలవరిస్తూ పలుకరించేకన్నా, మనమే ఆచరించి దర్శించడం ఉత్తమము కదూ! అవును. అయితే ఈ క్షణం నుండే ప్రయత్నిద్దాం. ఇక సెలవు.

సాధుజన విధేయుడు

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 22

ఆత్మస్వరూపా!

హరిః ఓం....ఓం నమో నారాయణాయ

మనం కొంతకాలం జపం చేస్తాము. మరికొంత కాలము ధ్యానము సాగిస్తాము. ఇంకా ఎన్నో ఆధ్యాత్మిక సాధన లాచరిస్తాము. ఈ సాధనలన్నీ దేనికి? మనస్సును శుద్ధిపరచడానికే. మనస్సు తప్పక శుద్ధిపడుతుంది. అయితే ఎంతవరకు? కొంతవరకే. కొంతకాలమే. దైనందిన జీవితములో అడుగిడగానే మనస్సు బహిర్ముఖ మవుతుంది. పరిసరాలకు బానిసగా మారుతుంది. ఆవేదనకు లోనవుతుంది. ఆందోళనలో చిక్కుకపోతుంది.

అలా కాకుండా మనస్సు సదా ప్రశాంతంగా ఉండాలి. ధ్యానస్థితిలో పొందిన ప్రశాంతత ఆధ్యాత్మికశాంతిలోనే కొనసాగాలి.అది ఎలా సాధ్యం? దానికి ఒక్కటే మార్గం. భగవంతుని సదా స్మృతియందుంచుకొని ఒక్క క్షణము కూడా విడువకుండా నామస్మరణ చేస్తూ వుండాలి. అప్పుడు మన హృదయములో ఆధ్యాత్మిక వాతావరణము ఏర్పడుతుంది. రాను రాను ఆ హృదయసౌందర్యాన్నే బయటకూడా గాంచగల్గుతాము. ఎన్ని కర్మల నాచరిస్తున్నను ప్రశాంతతను కోల్పోము. అంతయు భగవానుని దివ్యచైతన్యముచే వ్యాపకమై యున్నట్లు అనుభూతిని పొందగలము. మనం చేయు కర్మలు గూడా భగవంతుని శక్తిచే, దయచే జరుగుచున్నట్లు భావిస్తాము. అట్టి చైతన్యభూమికలో నివసించునపుడు ఎవ్వరికీ బాధ కలిగించలేము. ఎవ్వరినీ బాధపెట్టలేము. మన సంకల్పాలు భగవానుని చుట్టే పరిభ్రమిస్తూ ఉండాలి. మన నాలుక భగవన్నామాన్నే జపిస్తూ ఉండాలి. మన చేతులు భగవంతునికి సేవ చేయుచున్నట్లు కర్మ లాచరించాలి ఏదయినా తెలుసుకుంటే లాభం లేదు. ఆచరిస్తేనే ఆదాయం. నేను నడచిన మార్గమే మీకు చెబుతున్నాను. మీరూ ఆచరించండి. కాదు. ఆచరించాలి. ఇదే శుభఘడియ. ఆచరించు.

ప్రేమతో

భగవత్సేవలో

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 23

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

నిస్తరంగ జలకూపములో ఒక అల కదలినా ఆలోచించాలి. హోరున లేచే సముద్రకెరటాలలో ఒక అల ఉరికినందువలన పోయే దేముంటుంది? వాంఛాతీతుడై జితకాముడైనవాడు కోరికను దుఃఖమయంగా భావించవచ్చు. బాధపడవచ్చు. కోరికలకొంప నిర్మించుకొని కొరమాలిన కోరికలతో జీవించే మనం కోరికలను అంత తేలికగా దూరం చేసేందుకు వీలులేదు. అవి దూరమైతే మనమెవరో మనకే తెలియకుండా పోతుంది. కోరికలను విడనాడేందుకు చేసే ప్రయత్నమే మనలను కోరికలకు సన్నిహితం చేస్తుంది. పరిశీలనాదృక్పథాన్ని అలవరచుకోవాలి.

కొందరు సాధువులు ఒకచోట ఆసీనులై ఆధ్యాత్మిక చర్చ జరుపుచున్నారు. చెడును గూర్చి చర్చించసాగారు. కోరిక వలననే చెడు జరుగుచున్నది అనే విషయంలో అందరిది ఏకాభిప్రాయమైంది. ఇంతలో సర్వాంగసుందరి యగు ఒక పడచు వచ్చి నిలబడింది. తానే మూర్తీభవించిన వాంఛాస్వరూపమని తెలియజేసింది. సాధువులను చూసి"నేను మీకు శత్రువునా? మీ హృదయములలో నేను ప్రవేశించుట చేతనే కదా మీరు సత్యాన్వేషులయింది? మీ మనస్సులను నేను ఆశ్రయించుట వలననే కదా మీరు భగవద్దర్శనాభిలాషులై జపధ్యానాదులు సాగించుచున్నది? మేలు చేసినవారిని చెడుగా వక్రించడమేనా మీ సాధుత్వము?"అని తెలిపి అంతర్ధానమైనది.

సాధువులు ఆలోచించారు. సత్యాన్ని గ్రహించారు. కోరిక తనంతట తాను చెడు కాదు. కోరికను భ్రాంతిమయ వస్తుప్రపంచము వైపు నడిపే మానవుని అజ్ఞానమే దుఃఖానికి కారణము, మనిషికి పరమ శత్రువై యున్నది. కనుక కోరిక నిన్ను బంధించదు. నీ కోరిక పయనించే మార్గముమీద నీ అభివృద్ధి ఆధారపడి యుంటుంది. కోరిక ప్రపంచమువైపు నడిస్తే భ్రాంతి. పరమాత్మవైపు నడిస్తే శాంతి. మొదటిది బంధాన్ని కల్పిస్తుంది. రెండవది బంధాన్ని ఖండిస్తుంది. అంతా ఆలోచనాసరళిపై ఆధారపడి వుంది.

ప్రణవప్రేమలతో

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 24

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

ఒక వ్యక్తి రాత్రిసమయాన రెండు దీపాలను వెలిగించి, రెండు గదులలో ఉంచినాడు. విచిత్రముగా అతను పరీక్షించ నారంభించాడు. ఒక గదిలోని దీపము ఎక్కువ వెలుతురు నిచ్చుచుండగా మరియొక గదిలోని దీపము తక్కువ కాంతి నొసంగుచున్నది. కారణ మేమిటో అతనికి అర్థంకాలేదు. ప్రమిదలు రెండూ ఒకేవిధంగా ఉన్నాయి. రెండింటిలోను చమురు నిండుగా యున్నది. ఒకదానిలో తక్కువకాంతి, మరొకదానిలో ఎక్కువ కాంతి వచ్చుటకు కారణమేమి? ఒకదానిలోని వత్తి పెద్దది. రెండవ దానిలోని వత్తి చిన్నది. అంతే తేడా.

రెండు దీపాలలోను చమురున్నట్లు భక్తులందరిలోను భక్తి యుంటుంది. దీపాలలోని వత్తులలో తేడాలున్నట్లు భక్తులలోని శ్రద్ధలో తేడా ఉంటుంది. భక్తియున్న వారంతా భగవానుని ఆరాధిస్తారు. కానీ ఆ భక్తితో పాటు ఎక్కువ శ్రద్ధ గలిగినవారు భగవదనుగ్రహాన్ని పొందుతారు. గురువుల నాశ్రయించే వారంతా గురుభక్తితోనే సమీపిస్తారు. కానీ గురువచనములపై విశ్వాశముంచి, గురుదేవుని హృదయము నెరిగి వర్తించువారు గురుకృపకు పాత్రులై తరిస్తారు. శ్రద్ధలేని వారికి పరమాత్మపై బుద్ధి నిలువదు.

ప్రతి ఒక్కరిలోను అఖండమైన శక్తి యున్నది. శ్రద్ధ గలవారు అద్భుతమైన ఆత్మశక్తిని బహిర్గత మొనర్చగలరు. శ్రద్ధ లేనివారు బుద్ధిహీనులై జీవించుచుందురు. "బాబూ! 'ఓం నమో భగవతే వాసుదేవాయ' యనెడి మంత్రాన్ని జపించు, తప్పక తరించగలవు" అని ఒక వ్యక్తికి చెప్పడం జరిగింది. దాని కతడు "భగవంతుడు అంత తేలికగా లభించునా?" యని వ్యాఖ్యానించాడు. అలాగని కష్టమైన ధ్యాన సాధనలు చెబితే, "ఇంత కష్టమైతే ఎవరు చేయగలరు?" యని మాట్లాడినాడు. శ్రద్ధ లేనివానికి ఏమి చెప్పినా ప్రయోజనముండదు. శ్రద్ధ గలవాని బుద్ధికి సమస్తమూ అందుతుంది. హృద్యమైన శ్రద్ధ సమృద్ధిగా లభించాలే గాని వయస్సుతో నిమిత్తం లేకుండా అందరూ అభివృద్ధిని సాధించగలరు. ప్రయత్నించండి.

ప్రణవప్రేమతో

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 25

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ
వందనములు.

విచిత్రమైన విశ్వంలో వింతలకు కొఱత ఏముంది?

కొందరు ఎంతో విషయాన్ని సేకరించి, తలభారంతో ఊగిపోతూ పలవరిస్తుంటారు. అసంఖ్యాకములైన పత్రములను ధరించి చెట్లు ఊగుతూ ఉంటాయి. ఊగడమే గాని సాగడము వృక్షాలకు సాధ్యం కాదు. పలవరించడమే గాని ప్రవర్తించడము ఈ వ్యక్తులకు తెలియదు.

కొందరి నేత్రాలు పద్మసౌందర్యమును బోలి ఉంటాయి. కానీ ఉన్నదున్నట్లు చూడలేక వారు అంధులకన్నా అధ్వాన్నంగా జీవిస్తుంటారు.

దూరపు కొండలు నునుపుగా ఉంటాయి. సమీపిస్తే అంతా రాళ్ళ గణుపులే. చెట్ల గుంపులే. కొందరు ప్రారంభములోనే ఆకర్షిస్తారు. కానీ పరిచయంలో ప్రాణాలు పిండుతారు.

సింహాలు గర్జించి భక్షిస్తాయి. మేఘాలు వర్షించి రక్షిస్తాయి. తర్జన భర్జనలు జరిగితే గర్జనల పోకడలు తెలుస్తాయి. కొందరు వేదికలపై సింహగర్జనలు చేస్తారు. దృష్టంతా ఆర్జన మీదనే. కొందరు మేఘంలా గర్జించి జ్ఞానవర్షాన్ని కురిపిస్తారు. వీరిది ఆర్జన కాదు. ఆర్జవము.

ఎక్కువశాతము ఈ ప్రపంచములో బరువులెత్తేవారే. భుజాలెక్కే వారే. అందరూ దుఃఖభాగులే. అందరూ శోకదాతలే. ఈ మానవ స్వార్థజీవన సౌధము అహంకార స్తంభము మీదనే నిలిచి ఉంది. అదియే పునాది. అదియే ఆధారము. ఆధారస్తంభము స్థిరముగా యున్నంత కాలము భవనమునకు లోటు రాదు. చేటు లేదు. అహంకార మున్నంత కాలము స్వార్థజీవనము అంతరించదు.

కానీ ఒక్కమాట,

అంతా లోపాలే, అందరివీ పాపాలే. బాగుంది. మరి ఈ పాపాలను, లోపాలను పోషించిందెవరు? అహంకారము.

భేష్, మరో రెండు అడుగులు వేద్దాము. అహంకారము ఆవిష్కరించిన పాపాలను, లోపాలను వీక్షించేదెవరు? అహంకారమే.

నీటిలో చరించే చేపను నీటిలో వసించే మత్స్యమే చూడగలదు. అహంకార జీవనమును అహంకారియే గుర్తించగలడు.

అహంకారి చేసే పాపాలను మరొక అహంకారి చూస్తున్నాడు. ఒక అహంకారి లోపాలను గాంచి మరొక అహంకారి శాపాల నందించుటయా?

ఉండరానిది ఉన్నంతకాలం ఉన్నతి సాధ్యంకాదు. సృష్టిలో దృష్టిని సారించు వానికంటె దృష్టిలోని సృష్టిని సవరించుకొనువాడే పుష్టి ననుభవించగలడు. కష్టముల నధిగమించగలడు.

నీకు అన్నీ తెలుసు. పాపం........నిన్ను గూర్చి మాత్రమే నీకు తెలియదు. అంతే. ఇప్పటికి అంతే. బ్రతుకంతా అంతే అయితే ఇక జీవితములో మిగిలేది చింతే.

చింతను చింతనగా మార్చే ప్రయత్నములో
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 26

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ
వందనములు

జీవితము గొప్ప పరిశోధనాకేంద్రము. సాధకుడు పరిశోధకుడు లేదా శాస్త్రజ్ఞుడు, సాధనే పరిశోధన.

పరిశ్రమయే పరిశోధనమునకు పునాది.

ఘనకార్యములన్నీ పట్టుదలతోనే సాధించబడ్డాయి. ఆధ్యాత్మిక సాధకులు పట్టుదల గలవారై యుండాలి. పట్టుబట్టి సాధించగలవారై యుండాలి. ఇక్కడే కార్యకర్తలు మూడు విధాలుగ విభజింప బడుతారు.

ప్రారభ్యతే న ఖలు విఘ్న భయేన నీచైః
ప్రారభ్య విఘ్న విహతా విరమన్తి మధ్యాః
విఘ్నైః పునః పునరపి ప్రతిహన్య మానాః
ప్రారబ్ధ ముత్తమగుణా న పరిత్యజన్తి!!

ఆటంకము ఎదురౌతాయని అధములు అసలు కార్యములనే ఆరంభించరు. మధ్యము లైనవారు కార్యములను ప్రారంభిస్తారు, కానీ ఆటంకములు రాగానే విరమిస్తారు. ఉత్తములైనవారు కార్యమును చేపట్టి ఎన్ని అడ్డంకులు, అవాంతరములు ఎదురైనను పట్టుదలతో సాధిస్తారు.

సాధకులు ఉత్తములై యుండాలి. అప్పుడే పట్టుదలతో సాధింపగలరు. పట్టుదల ఉండాలి. కానీ అది ఉడుముపట్టులా మూర్ఖంగా ఉండకూడదు. పట్టువిడుపులు తెలిసి జీవించువారే అజ్ఞాన పట్టు నుండి విడిపడి తరించగలరు.

భగవంతుని విషయంలో పట్టుదలతో చరించు సాధకుడు మనస్సుపై పట్టును కలిగియుండాలి. నీవు మనస్సును పట్టుకోవాలి అంటే ఇంతవరకు తాను పట్టుకొని యున్న వాటిని మనసు వదలగలగాలి.

ఆలయానికి నీవు వెళ్ళగలవు. కానీ అర్చించే మనసు నీతోకూడా రావాలి. అప్పుడే ఆలయానికి వెళ్ళిన ఫలం దక్కుతుంది.

ఆశ్రమానికి మనం పోవచ్చు. గురువును సమీపించవచ్చు. ఆరాధనా భావంతో లేనపుడు, ఆశ్రయస్థానం మరొకటైనపుడు ఆశ్రమాలు కూడా శ్రమలనే పంచుతాయి.

కాశికి వెళ్ళడం మంచిదే. కానీ చంకన పిల్లి ఉండటం మంచిదిగాదు. కాశికి వెళ్ళడానికి పిల్లి అంతరాయం కాదు. కానీ విశ్వనాథుని వీక్షించుటకు అవరోధం.

కొందరు ఉత్సాహంతో తీర్థక్షేత్రాలకు వెళ్తారు. నిరుత్సాహంతో తిరిగొస్తారు. మరికొందరు ఉరకలేస్తూ ఆశ్రమాలకు పరుగిడుతారు. నిస్పృహతో నిష్క్రమిస్తుంటారు.

నిష్క్రమణలో నిరవధికసుఖం లభించాలంటే ప్రవేశము పవిత్రంగా ఉండాలి. ఉన్నట్లే అనిపిస్తుంది. పరిశోధనలలో నిజానిజాలు గోచరిస్తాయి. కనుకనే సాధకుడు పరిశోధకుడై ఉండాలి.

ప్రవేశసమయాన మనస్సు పట్టుకొని యున్న వాటిని వదలించుకోవాలి. ఆ విడుపులోనే నిజమైన పట్టు దొరుకుతుంది. పట్టు దొరికితే బ్రతుకు గట్టున పడ్డట్లే.

పవిత్ర స్థలాలకు వెళ్ళేటప్పుడు అహంకారాన్ని, దర్పాన్ని, స్వార్థాన్ని త్యజించి వెళ్ళాలి. నమ్రతను, అవగాహనను, త్యాగాన్ని నింపుకొని వెళ్ళాలి. రాజ సింహాసనముపైనే ఆసీనుడైతాడు. భగవంతుడు పవిత్ర హృదయంలోనే వసిస్తాడు. బాహ్యంలో ఏదో సాధించాలనే తపన కన్నా తనను తాను శోధించి, నిజానిజాలను వీక్షించ గలిగిన వారే సాధకులవుతారు.

దాహం ఉన్నవారు వాంఛించేది నీటినే. సాధకులైనవారు ఆశించేది పరమాత్మనే. అన్యమైన వాటిని ఆశించే మనసుకు భగవంతుని అవసరం ఉన్నాదా? ఆలోచించండి.

మచ్చిక తెలియని పిచ్చి మనసు పచ్చి కురుపు లాంటిది. సూదులతో గ్రుచ్చినట్లే ఉంటుంది ఆ బాధ. ప్రేమ యనెడి ఔషధముతో ఈ వ్రణమును నయం చేసుకోవాలి. అప్పుడే మనిషికి ఊరట లభిస్తుంది. మనుగడకు స్ఫూర్తి ప్రాప్తిస్తుంది.

ఇతరులు ఎలా ఉండాలని భావిస్తున్నావో నీవు అలా ఉన్నావా?

నీవు సుఖపడు. కానీ ఆ సుఖం ఇతరులకు కూడా ఉండాలని యోచించావా?

నీ దుఃఖాన్ని ఇతరులు పంచుకోవాలి. మరి వారి దుఃఖాన్ని నీవు పంచుకోగలవా?

నీ నుండి ఏది కదుల్తుందో అదే నీకు కల్గుతుంది. పట్టుదలతో జీవించు. పట్టువిడుపులు తెలిసి తరించు.

నమస్కారం

మోక్షమార్గాన
ముముక్షువుల మధ్య
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 27

ప్రియాత్మా!

ఓం నమో భగవతే వాసుదేవాయ.

వందనములు.

ఆషాఢంలో ఆచార్యుని సేవ, శ్రావణంలో ఆదిదేవుని సేవ - ఒక మాసం గడువులో గురుగోవిందుల సేవాభాగ్యం నిజానికి భక్తులకు, ముముక్షువులకు వరప్రసాదమనే చెప్పాలి.

మొదట గురుపూర్ణిమ; తరువాత కృష్ణాష్టమి. ముందు గురువు లభిస్తాడు; తరువాత గోవిందుడు అనుగ్రహిస్తాడు. ఈ మధ్యకాలం ఒక్క నెల మాత్రమే. గురుదేవుడు, ఆదిదేవుడు ఇరువురూ ఒక్కరే యని దాని భావమా?

ఆషాఢంలో ఆచార్యుని సేవనం-శ్రావణంలో శ్యామనాథుని దర్శనం-ఇది జరిగితే బ్రతుకంతా భద్రమే. అందుకేనేమో భాద్రపదంలో విఘ్ననాయకుని అర్చన! ఆ తరువాత అంతా విజయమేనని సూచిస్తూ ఆశ్వయుజంలో విజయదశమి. విజయాన్ని సాధించిన సాధకులు మోక్షసామ్రాజ్యా నధిష్ఠించి శోభిస్తారు. ఇది మామూలు వెలుగు కాదు. జ్ఞాన వెలుగు. జ్ఞానదీపం ...అదియే కార్తీకంలో దీపావళి.

ముముక్షువు అందరూ సాధనకు ప్రాముఖ్యత నివ్వాలి. సంశయ కెరటాల మధ్య జీవననౌక తారుమారు గాకుండా చూసుకోవాలి. నూతన బాటలు అన్వేషించడం మాని నూతన నడకను నేర్చుకోవాలి.

కొందరు ధ్యానం నేర్పమంటే ధ్యానం నేర్పాను. ఇంకెక్కడో సులభంగా ధ్యానాన్ని నేర్పుతారని విని అక్కడి కెళ్ళారు. నాలుగు రోజులు తికమకపడి వచ్చారు. "స్వామీ! మీరు నేర్పిన ధ్యానం శాంతి నిచ్చింది. అక్కడ అంతా అయోమయం" అంటారు. ఈ మాటలు విని పొంగిపోయే స్వల్పబుద్ధి నాకుందని.

గురువును అనుసరించడం, గోవిందుని అనుస్మరించడం అంత సులభమైనపని కాదు. గురువును అనుసరించడం అంటే గురువుకు శరణాగతులు కావడం అని భావం. ఇక్కడ స్వేచ్ఛ హరింపబడుతున్నదని వాగుడుకాయల పలవరింపు. క్రమజీవనం లోనే నిజమైన స్వేచ్ఛ ఉన్నదని గ్రహించే సంస్కారం ఎందరికుంటుంది?

భగవంతు డొక్కడే. అట్టి భగవంతుని జూపే గురుదేవుడు కూడా ఒక్కడే. "అనేకమంది గురువులను స్వీకరించవచ్చా?" అని చాలామంది నన్ను ప్రశ్నిస్తుంటారు. ఈ విషయంలో నాకు స్థిరమైన అభిప్రాయాలున్నాయి. ఇక్కడ నేను రాజీపడను; పడలేను.

గురువు ఒక్కడే ఉండాలి. ఒక్క గురువునే అనుసరించాలి. అనేక గృహాల ముందు నిలబడి యాచించి ఆకలి తీర్చుకోవడం బిచ్చగాని లక్షణం. అమ్మ నడిగి ఆకలి తీర్చుకోవడం బిడ్డ లక్షణం. గురుబిడ్డలు బిచ్చగాళ్ళు కాకూడదు.

నా ఆశ్రమంలో ఉండాలని, నా శిష్యులుగా పడి ఉండాలని భావించి వచ్చే వారికి నేను ఒకే విషయం చెబుతుంటాను. "బాబూ! ఈ పడిగాపుల వల్ల బ్రతుకులో వడగాడ్పులు తొలగవు. నేను నీకు క్రొత్త కావచ్చు. గురువులు నీకు క్రొత్తగాదు. అనేకమందిని చూసి నా దగ్గరకి వచ్చావు. నన్ను చూసి మరొకరి దగ్గరికి చేర్తావు. గురువుల వద్ద ఉండేందుకు అలవాటు పడ్డావు. క్రొత్త గురువు వద్ద పాత గురువుల్ని నిందించేందుకూ సిద్ధపడ్డావు. ఇలా ఎంతకాలం తిరుగుతావు? తిరిగి తిరిగి ఏం వంట బట్టించుకున్నావు? "తిరిగేరాతికి పాచి పట్టదు" అనే నానుడికి నూతన అర్థాన్ని ఇస్తున్నావు. అంతే. నీకు కావలసింది ఆచార్యుడు కాదు. అనుసరించే బుద్ధి. అది లేనినాడు ఆచార్యుడు ఉండి ఉపయోగం లేదు."

ఇక్కడ నా భావం స్పష్టంగా, స్వచ్ఛంగా ఉంది. తొందరపడి అపార్థాన్ని సృష్టించుకోకండి. నేను చెప్పింది "అనుసరించమని" - నన్ను అనుసరించమని కాదు.

అర్థమైనదా! ఇకనైనా అనుసరిద్దామా! కానీ మిత్రమా! ఒక్కమాట! నీవు గురువు ననుసరించాలంటే, ఆశ్రయించాలంటే, నీ మనస్సును అనుసరించడం మానేయాలి సుమా! అప్పుడే అది శరణాగతి అవుతుంది.

మాటలో బాట, బాటలో మాట - ఇదియే గురుదేవుని మార్గం.

ఇక ఎవరి బాట వారిది.

నమస్తే

ఇట్లు
అనంత యాత్రలో
అవిశ్రాంత బాటసారి
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 28

నిద్ర లేపే నిజాలు

ఆత్మస్వరూపా!

హరి: ఓం... ఓం నమో నారాయణాయ

వందనములు.

జీవన రహదారిలో ప్రయాణం ఊహించినంత సులభం కాదు. బాట అందరిది. అందరూ బాటసారులే. పదిమంది నడచే బాటలో కలిసి ప్రయాణం చేసినా బాధే. ఒంటరిగా నడచినా బాధే. బహుదూరపు ప్రయాణంలో దుఃఖమే నిత్యస్నేహితుడు. ఈ సత్యాన్ని తెలిసి జాగ్రత్తగా ప్రయాణం చేసేవారు ఆపదలకు గురికారు. ధూర్తులకు దూరం కాలేరేమో గాని దుఃఖానికి మాత్రం దూరమవుతారు. బుద్ధిలేని బాటసారి మాత్రమే దారిలో అనవసరంగా దుమ్మురేపుతాడు. చెడుగా పలవరించడం, చెడుగా ప్రవర్తించడం మాత్రమే తెలుసు మనిషికి. బండి చక్రము ఆ బండిని లాగే ఎద్దును అనుసరించునట్లు, చెడుజీవనానికి అలవాటు పడిన మొద్దును దుఃఖము అనుసరిస్తూ ఉంటుంది. చెడు యొక్క ఫలితము రానంత వరకు చెడులోనే మనిషికి మంచి కనిపిస్తుంది. ఫలితం వచ్చినప్పుడు దాని భీకరాకృతి తెలుస్తుంది.

పంట నంటియున్న కలుపు పంటనే పాడుచేస్తుంది. మనస్సు నంటియున్న ద్వేషం ఆ మనసునే దగ్ధం చేస్తుంది.

మంచిగా బ్రతకడం మనిషికి భగవంతుడు ప్రసాదించిన వరం. మంచి చేయడానికి ఆలస్యం చేస్తే ఈలోగా మనసు చెడు నాచరించి తీరుతుంది. నిలువబెట్టిన పెరుగు పుల్లగా మారుతుంది. మనసులో నిలిచిపోయిన ద్వేషం బ్రతుకునే అమాంతం చేదుగా మార్చుతుంది.

ఈ చెడులు-చేదులే సమాజంలో ఎక్కువగా ఉంటాయి. అసూయ లుంటాయి. వాటికి ఆడిపోసుకోవడమే తెలుసు. ద్వేషాలుంటాయి. అవి మోసాలకు వెనుకాడవు. ఈ మందలు నిందలు వేసేందుకే అలవాటు పడి ఉన్నాయి. బుద్ధ భగవానుడు ఇలా అంటాడు:

"This is an old saying, Atula, it is not a saying of today. They blame the man who is silent, they blame the man who speaks too much; and they blame the man who speaks too little. No man can escape blame in this world."

"అతులా! ఈ సూక్తి ఈనాటిది కాదు. ఇది ప్రాచీన సూక్తి. వారు అసలే మాట్లాడని వ్యక్తిని నిందిస్తారు. అతిగా మాట్లాడే వ్యక్తినీ నిందిస్తారు. అతి తక్కువగా మాట్లాడే వ్యక్తినీ నిందిస్తారు.. ఈ ప్రపంచంలో ఎవ్వరూ నిందను తప్పించుకోలేరు."

'నింద' యొక్క తత్వం ఆలోచిస్తే బహు అందంగా ఉంటుంది. నింద వ్యక్తిగతమైన సమస్య. ఒక వ్యక్తి లేదా కొందరు నిన్ను నిందించవచ్చు. అంతమాత్రాన ఒరిగిందేమిటి? జరిగిందేమిటి? నిందించడం ఆ వ్యక్తి లక్షణం. అతని స్వభావానికి నీవు బాధపడటం దేనికి? ఒకవేళ నీవు లేవనుకో. మరొకరిని ద్వేషిస్తాడు. ఎవరూ లేకపోతే, తననే తాను ద్వేషించుకుంటాడు. కట్టెలోని అగ్ని కట్టెను దహించి వేయునట్లు మనిషిలోని ద్వేషం మనిషినే దహించివేస్తుంది. అసూయల మధ్య, ద్వేషాల మధ్య, ఈర్ష్యల మధ్య ఆనందంగా జీవించడం అలవడితే ఆధ్యాత్మికత వంటబట్టిందని అర్థము.

నీవు చెడ్డవాడివైతే ఎవ్వరూ నిన్ను విమర్శించరు. ఎందుకని? ఆ పని నీవూ చేస్తావు గనుక. నీవు మంచివాడివైతే నీ మంచితనం సమాజంలో నీ ఖ్యాతిని పెంచుతుంది. పెరిగే ఖ్యాతి దుష్టులలో ద్వేషాన్ని పెంచుతుంది. ప్రసిద్ధిగాంచి తృప్తిచెందే బుద్ధి బుద్ధిహీనుల కెందుకుంటుంది? ఖ్యాతిని, అపఖ్యాతిని రెండింటిని ప్రక్కకు నెడితే శాంతి చేరువవుతుంది.

నిందలేసే మందమతుల నుండి మహాత్ములు కూడా తప్పించుకోలేదు. అవతార పురుషులు కూడా తప్పించుకోలేదు. అంతమాత్రాన వారి ఖ్యాతి వక్రించిందా?

హోరుగాలికి ఎదురుగా నిలబడి దుమ్మెత్తిపోస్తే తిరిగి ఆ దుమ్ము వాని కళ్ళలోనే పడుతుంది.

హోరున గాలి వీచినా, జోరున వాన కురిసినా పర్వతం చలించదు. సమాజము మెచ్చుకున్నా, నొచ్చుకున్నా జ్ఞాని చలించడు. భక్తుడు చలించకూడదు. నిందాస్తుతులు అతన్ని తాకలేవు. భగవంతుడు మనిషికి మాట్లాడే శక్తి నిచ్చాడు. వ్యర్థప్రలాపాలకు అలవాటు పడిన వ్యక్తి వృథాగా మిగిలిపోతాడు. వ్రాయడం ఒక కళ. కొందరు రాతలు తుడిచే వ్రాతలు వ్రాస్తారు. కొందరి వ్రాతలు మంచి మనసులపై వాతలు పడేస్తాయి. ఏం చేద్దాం? కలం తప్పు చేయదు. కాగితం దోష మెరుగదు. కలి దూరిన మనసు నుండి కల్మషాలు తప్ప మరేమి కదుల్తాయి?

అవగాహన పెరిగితే నిందాస్తుతులు, మానావమానాలు, సుఖదుఃఖాలు నిన్ను స్పృశించలేవు. ఉండి బాధించేది దుఃఖం. లేక బాధించేది సుఖం. బాధించే లక్షణాలు రెంటికీ ఉన్నాయి. రెండిటిని దాటేస్తే-అంతా ఆనందమే.

సన్మానాలలో వెల్గొందేవాడు విద్వాంసుడు.
మానావమానాలలో శోభించేవాడు సాధువు.
సాధువు కాగలిగితే నీకు బాధ లెక్కడివి?

విమర్శలు ఎప్పుడూ ఉంటాయి. వాటిని పరామర్శించడం పతనహేతువు అవుతుంది. పలవరించకుండా, పలకరించకుండా పర్యవేక్షిస్తూ ప్రయాణం సాగించాలి.

స్టీరింగు నెవ్వరైనా పట్టుకోగలరు. ప్రమాదమునకు గురికాకుండా నడుపుకుపోయేవాడే మేటిడ్రైవరు. జీవన రహదారిలో విమర్శల రాళ్ళ గుట్టలు తప్పవు. చాకచక్యంతో బండిని నడుపుకు పోవాలి. అవగాహన పెరిగితే అవరోధాలు తొలగినట్లే.

మచ్చుకు నా అనుభవం నుండి ఒక మాట చెబుతాను.

నావద్దకు ఒక విమర్శకుడు వచ్చాడు.

"స్వామీ! ఫలానా వ్యక్తి పూర్వం మీ దగ్గరకి తరచూ వస్తూవుండేవాడు. ఈమధ్య కాలంలో కన్పించడం లేదే" అన్నాడు.

"ఆయన చిరునామా ఉంది. వెళ్ళి కలుస్తారా?" అన్నాను.

"అబ్బే! అలాంటిదేమీ లేదు. ఊరకే....తెలుసుకుందామని" అన్నాడు.

"నాదగ్గర నీవు తెలుసుకొనేందుకు ఇంతకన్నా మంచి విషయం లేదా మహాత్మా! పైగా ఇది తెలిసికొని నీవు సాధించే దేముంటుంది? అనవసర విషయాలను చర్చించేందుకు మనసు అలవాటు పడింది. అయినా అడిగావు గనుక చెబుతాను...విను" అంటూ మొదలెట్టాను.

"నాయనా! ఆయనెందుకు రావడం లేదో, ఎందుకు దూరమయ్యాడో ఆయనకే తెలిసుండాలి. నన్నడిగితే ఏం ప్రయోజనం? అయినా ఆశ్రమంలో ఎందరో ఉన్నారు గదా? నన్నే ప్రశ్నించడంలో నీ ఆంతర్య మేమిటి? పేచీలు పెట్టుకొనే సుగుణం ఆశ్రమాధిపతికే ఉంటుందని తమ అభిప్రాయమా?"

"బాబూ! నీవు ఊహించినంత గొప్పవాణ్ణి నేను కాను. పక్షి ఎందుకు ఎగిరిపోయిందని చెట్టును ప్రశ్నిస్తావేమిటి? వచ్చేవి వస్తుంటాయి. పోయేవి పోతుంటాయి. ఆహ్వానాలు లేవు. వీడ్కోలు ఉండవు. అర్థమయిందా!" అన్నాను ఆ విమర్శకుని పుట్టు పూర్వోత్తరాలు తెలిసినవానివి గనుక.

వెంటనే అతనంటాడు "చాలా బాగా చెప్పారు స్వామీ! కానీ అతను చాలాకాలంగా మీకు సన్నిహితుడని విన్నాను. అందుకని అడిగాను" అన్నాడు మళ్ళీ ఆయన వాయిద్యాన్ని శృతిచేస్తూ.

ఇక లాభంలేదనుకొని నేను ముక్తాయింపు ఇచ్చేశాను.

"చెంచా పాయసంలో కొన్ని గంటలుంటుంది. ఏం గ్రహించింది? ఒక్కక్షణంలో నాలుక పాయసం యొక్క మాధుర్యాన్ని గ్రహిస్తుంది;" అన్నాను.

"ఆహా! ఎంత చక్కగా సెలవిచ్చారు? ఎంతటి తియ్యటి విషయాలు చెబుతుందండీ స్వామీ మీ నాలుక" అన్నాడు నన్ను శ్లాఘిస్తూ.

"మీకూ నాలుక ఉంది" అని నేను లేచి లోనికి వెళ్ళాను, అతడు బయటికెళ్ళాడు. లోనికెళ్ళడం నా అలవాటు. బయటపడటం అతనికలవాటు. ఏం చేద్దాం? ఎవరి జీవితాలు వారివి.

ఇంతకీ చెప్పొచ్చిందేమిటంటే-

విమర్శలు ఎవరినీ విడువవు. వాటిని పరామర్శిస్తూ పోతే నీవు ప్రగతిని సాధించలేవు. నీవు సాధకుడివి. సాధనే నీ ప్రధానలక్ష్యం కావాలి.

గాలి వీచేవి మాకులు
గోల చేసేవి కాకులు.
మాకుల్లా ఊగిపోనవసరం లేదు. కాకుల్లా ఏరేగనవసరం లేదు.
హంసలా జీవించడమే మన కర్తవ్యం
పరమహంసలా తరించడమే మన ధర్మం.

నమస్తే.

ప్రస్తుతానికి
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 29

ఆత్మస్వరూపా!

హరిః ఓం....... ఓం నమో నారాయణాయ.

వందనములు

ఏ విత్తనము నాటితే ఆ చెట్టే లభిస్తుంది. మనసు దేని నాలోచిస్తుందో మనిషి అలాగే తయారవుతాడు. ధ్వనిని బట్టే ప్రతిధ్వని.

ఈ ప్రపంచంలో అనివార్యమైన ధర్మమొకటుంది. నీవు ఇతరులకు దేనిని ఇస్తావో నీకు అదియే మిగుల్తుంది.

ప్రపంచానికి ఆనందాన్నిస్తే నీకూ ఆనందం లభిస్తుంది. ద్వేషాన్ని పంచితే తిరిగి ద్వేషమే నిన్ను ఆవరిస్తుంది. ఈర్ష్యను అందిస్తే దానినే ప్రపంచం నీ ముందుంచుతుంది.

పాపాన్ని చూసి భయపడేవాడు సాధకుడు. సజ్జనుడు. పుణ్యాన్ని అసహ్యించు కొనేవాడు పాతకుడు, దుర్జనుడు.

పాపకర్మలను పెంచుకొంటూ పోవడం పాపి లక్షణం. పుణ్యకర్మలను ఆవిష్కరించడం సాధులక్షణం.

పాపులు దుష్కర్మల ద్వారా ప్రపంచంలో దుఃఖాన్ని విస్తరింప జేస్తుంటారు. సాధుస్వభావులు సత్కర్మలను విస్తృతం చేయాలి. సద్భావాలను వెదజల్లుతూ పోవాలి.

పరమాత్మ సత్కర్మలకు సహకారిగా నిలుస్తాడు. దుష్కర్మలను రాక్షసులు ప్రోత్సహిస్తారు.

విశ్వానికి మిత్రుడు విశ్వామిత్రుడు. ఆయన ఆచరించే యజ్ఞాలు లోక కళ్యాణాన్ని ఆవిష్కరిస్తాయి. వాటిని పాడుచేయాలని రాక్షసులు చేయరాని పనులు చేస్తారు. విశ్వామిత్రునికి రాముని అండ ఉంది. రాక్షసులు నశించిపోయారు.

దుష్టకర్మలు దౌర్జన్యరూపాలు. శిష్టకర్మలు సౌజన్య స్వరూపాలు. పాడుపనిని ఏ నీచుడైనా చేయగలడు. మంచి కార్యాన్ని మనీషులే చేయగలరు.

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 30

ఆత్మస్వరూపా!

హరిః ఓం....ఓం నమో నారాయణాయ.

వందనములు.

"స్వామీ! నాకు మంచిరోజు లెప్పుడొస్తాయి?" అని ఒక భక్తుడు నన్ను ప్రశ్నించాడు?

మంచిరోజు లెలా ఉంటాయి?" అని నేను తిరిగి ప్రశ్నించాను.

"బాధలు లేకుండా-బరువులు తెలియకుండా హాయిగా, తృప్తిగా జీవించే రోజులు" అన్నాడా భక్తుడు.

"బాధలు, బరువులు మోసేదెవరు?" అన్నాను.

"మనసే కదా స్వామీ?" అన్నాడు.

"అంతే కదా బాబూ! ఒకవైపు బాధలను గుర్తిస్తూ, బరువులను దర్శిస్తూ వాటిని మోసేందుకే మనసు అలవాటుపడింది. ఈ క్షణాన మంచిని చేయలేని మనసు ఎప్పుడు మంచిరోజులు వస్తాయా అని ఎదురుచూస్తూ ఉంటుంది," అని ప్రారంభించి ఆయనకి వివరణనిస్తూ నేను మననంలో పడ్డాను.

ఈ క్షణాన పవిత్రంగా భగవంతుని ధ్యానించడం ప్రారంభిస్తే మంచిరోజులు ఇప్పుడే ప్రారంభమయ్యాయని భావము. పలవరించడం మాని ప్రవర్తించడం అలవరచుకోవాలి.

జీవితాన్ని తన నుండి వేరు చేసికొని ప్రత్యేకంగా అర్థం చేసుకోవాలని సాధకుడు భావించకూడదు. నీతో కలిపి జీవితాన్ని అర్థం చేసుకున్నప్పుడే నీకు సత్యం తెలుస్తుంది.

తానెవరో తనకు తెలియని వాడు జీవితాన్ని అర్థం చేసుకోలేడు. ప్రపంచాన్ని దర్శించలేడు.

త్రాగుబోతుకు ప్రపంచం ఉన్నదున్నట్లు తెలియదు. అర్థంకాదు. పిచ్చివాడు కూడా అంతే. ఎందుకని? వారిరువురు తమను తాము తెలుసుకోలేని స్థితిలో యున్నారు.

సాధకుడైన వాడు ప్రతిక్షణము తనను తాను అవలోకించుకొనే అభ్యాసమును కలిగియుండాలి.

నేను ఉపన్యాసాలు ఆరంభించిన ప్రారంభరోజుల్లో ఒకనాడు నాకొక దుర్భర సమస్య ఎదురైంది. నేను వెళ్ళి కన్నీళ్ళతో భగవానుని విగ్రహం ముందు

నిలబడ్డాను. చేతులు జోడించి నమస్కరించాను. నా సమస్యను పరమాత్మ ముందు ఉంచేందుకు సిద్ధమయ్యాను.

నా మనస్సులో మెరుపులాగా ఒక ప్రశ్న మెదిలింది. నేను ఇక్కడికి రాక పూర్వమే నా సమస్య భగవానునికి తెలుసు కదా? మరి నేను చెప్పడ మేమిటి? అంతే. సాగిలబడి నమస్కరించాను. "తండ్రీ! నీ చూపులకు నేను దూరంగా లేను. చూసేవాడివి నీవే. దయ చూపేవాడివి నీవే. నీకన్నీ తెలుసు;" తిరిగి వచ్చేసాను. ఇంటికి చేరేలోగా ఆ దుర్భరసమస్య నీటి మీద వ్రాత లాగా మిగిలింది. ఆనాటినుండి నా సమస్యలేవీ నేను పరమాత్మకు వినిపించలేదు.

ఏదో చేయాలి అని ఆరాటపడే కన్నా ఏం చేయాలి? ఎందుకు చేయాలి? ఎలా చేయాలి? అని విమర్శించుకొని ఆచరించే సాధకునికి చిక్కులు ఎదురు నిలువవు.

మంచి చేయడానికి ప్రారంభించినపుడే మంచిరోజులు వస్తాయి. ఈ మాత్రం విశ్వాసం కలిగితే చాలు. మన హృదయంలో భక్తిని భగవంతుడే కరుపుతాడు. కుదుపు లేకుండా, అదుపు తప్పకుండా ముందుకు నడుపుతాడు. తానే ప్రేరణ కలిగిస్తాడు. తానే ప్రార్థనను నడిపిస్తాడు. తానే ఫలితాలను ప్రసాదిస్తాడు. మరి మనం చేసేదేమిటి? ఏమీలేదు. మనం చేయవలసిందల్లా అహంకారం తలెత్తకుండా చూసుకోవడమే. మమకార సుడిగుండంలో పడకుండా జాగ్రత్తపడటమే.

చెత్తను పారవేసినట్లు ఈ దేహాన్ని ఒకనాడు విసిరివేయాల్సి వుండగా దేనికి అహంకారం? దేనిపై మమకారం?

రాయి తగిలి కాలికి గాయమైంది. కత్తితో ఆ గాయాన్ని కొట్టుట వలన గాయం నయమవుతుందా? అజ్ఞాన గాయానికి అహంకార కత్తిపోటు కూడా అలాంటిదే:

అచ్యుతుని ఆశ్రయించుటయే చక్కని ఔషధము. అనంతుని ఆరాధించుటలో సర్వం సమకూరుతుంది.

భగవత్సేవలో
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 31

ఆత్మస్వరూపా!

హరి: ఓం ...... ఓం నమో నారాయణాయ

వందనములు

సాధన....సాధన....సాధన.

గురువు సాధనను నేర్పుతాడు. సాధన చేస్తున్నారా? అని ప్రశ్నించడు గురువు. గురుబోధలు శిష్యుల కర్థమయితే వారు సాధనలోనే యున్నారని భావము. ఆ విధంగా జీవించలేక పోతే మళ్ళీ బోధలు వినాలి. చదవాలి.

ప్రయాణంలో ధూళి అంటకపోదు. ధూళి అంటడం తప్పు కాదు. దులపకపోవడం తప్పు. అనంత జీవనయాత్రలో మనమంతా బాటసారులం. ధూళి చేరుతూవుంది. అనేక జన్మల నుండి తెరలుపొరలుగా చేరిపోతూ వుంది.

అలాగని నీరసపడకండి. దుమ్ము చేరినంత మాత్రాన దర్పణం పాడుగాలేదు. దుమ్మును దులిపితే చాలు. మరుక్షణంలోనే దర్పణం వస్తువును ప్రతిబింబింప చేస్తుంది. దర్శనం ప్రాప్తిస్తుంది.

దులపడం సేవ.....దర్శనం ధ్యానం.

కాలం నేడు సానుకూలం. పవనాలు అనుకూలంగా వీస్తున్నాయి. ఎగసిన కెరటం వెనుదిరిగి కడలిని చేరే సమయ మాసన్నమైంది. వ్యాపారం ముగిసింది. ఇంటికి చేరే మార్గం చేరువైంది. కదలిన చోటికి వెళ్ళి కలసిపోవాలి.

సాధకా! నడచిపో! ఊ(......చూస్తున్నావేం? నిన్ను ఎవరూ చూడటం లేదనా? పిచ్చివాడా! అన్యుల నాశ్రయించి ఇంతవరకు ఏమి సాధించావు? ఇకముందు ఏమి సాధించబోతావు? కాయకు చెట్టు ఆధారం గాని కాయకు మరొక కాయ ఆధారమవుతుందా?

నిలకడగా ఆలోచించు......నిలబెట్టిన వానిని ఆశ్రయించు.

బుధజనుల బాటలో
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 32

ఆత్మస్వరూపా!

హరి: ఓం..........ఓం నమో నారాయణాయ.

వందనములు.

స్వల్పమైన, అల్పమైన సుఖాలను త్యాగం చేస్తే, అధికమైన, అద్భుతమైన ఆనందాలను అనుభవించవచ్చు.

వదలడం కొందరికి కష్టంగా ఉంటుంది. ఉంచుకోవడం మరికొందరికి కష్టంగా ఉంటుంది.

ఎన్ని వున్నా, ఎందరున్నా - ఏమీ గాకుండా, ఎవరికీ చెందకుండా ఉండేవారు ధన్యజీవులు.

జయము కలిగిందని పొంగిపోవడం సబబే. కానీ అపజయము చవిచూసిన వ్యక్తి యొక్క ద్వేషానికి దూరం కాలేము అనే సత్యాన్ని మరువకూడదు. జయించిన వానికన్నా జయాపజయాలను సమానంగా భావించి త్యజించిన వానిని ద్వేషాలు అంటవు. దోషాలు చేరవు.

శత్రువు నిన్ను బాధించవచ్చు. అసూయాపరులు నిన్ను హింసించవచ్చు. ఈర్ష్య గలవారు నిన్ను ఇక్కట్లకు గురిచేయవచ్చు. కానీ దారితప్పిన నీ మనస్సు అందరికన్నా ఎక్కువగా నిన్ను బాధిస్తుంది. దుఃఖానికి గురిచేస్తుంది.

నడక నేర్చిన బాటసారులారా! లేవండి. నిద్రలేవండి. రాత్రి ఎలాగూ గడచిపోయింది. పగలు కూడా పాడైతే ఎలా? యుగాలు నిద్రించాము. నిజాలు గ్రహించేదెప్పుడు?

మనం ప్రయాణంలో ఉన్నామని చాలామందికి తెలియదు. తెలిస్తే మోకాళ్ళు ముడుచుకొని కూర్చోలేరు. నీవు నడచినా, కూర్చున్నా, ఎలావున్నా కాలానికి నష్టం లేదు. నీవు కలిసి రాలేదని కాలం ఆగదు. తన ప్రయాణాన్ని ఆపుకోదు.

చెట్టును అంటిపెట్టుకొని నెమ్మదిగా, క్షేమంగా ప్రాకడం తీగ కలవాటు. తొందరపాటుతో క్షణం విశ్రాంతి కూడా లేకుండా కొమ్మలపై దుమకడం కోతి కలవాటు. నిలకడ గల చెట్టు ఎవరిని పట్టించుకుంటుంది? ఎవరి చిత్తమెలా వుంటే అలా వారు చరిస్తుంటారు.

తీగలా మనసు సౌకుమార్యాన్ని సంతరించుకోవాలి. తీగ ఓపికతో చెట్టును ఆశ్రయించుకొని ప్రాకునట్లు, నీవు సహనశీలుడవై సాధనలో సాగిపోవాలి.

రోగి వైద్యుని సమీపించి ఔషధమును స్వీకరించవచ్చు. లేదా ఫలహారశాల కెళ్ళి తృప్తిగా ఆరగించవచ్చు. మందు వల్ల ఆరోగ్యము చేకూరుతుంది. మితిమీరి భుజించడం వల్ల దేహారోగ్యము మరీ పాడైపోతుంది.

కానీ, ఆరోగ్యాన్ని ప్రసాదించే ఔషధం చేదుగా ఉండొచ్చు. ఆరోగ్యాన్ని క్రుంగదీసే మిఠాయిలు తీయగా, రుచిగా ఉండొచ్చు. తన మనుగడకు ఏది మంచిదో రోగి నిర్ణయించుకోవాలి.

కష్టాలొచ్చినప్పుడు కన్నీళ్ళు కార్చడం అందరికీ తెలుసు. కానీ గత జన్మలలో ఆచరించిన పాపాలకు ఫలితాలే ఈ కన్నీళ్ళని ఎందరికి తెలుసు? అది తెలిస్తే బ్రతుకు ధన్యమౌతుంది. కన్నీళ్ళు కమనీయంగా గోచరిస్తాయి.

"తండ్రీ! నా పాపాలు కష్టాల్ని అందిస్తే, నీ కృప కన్నీళ్ళని ప్రసాదించింది. కష్టాల్ని తలచుకొని దుఃఖించడం కన్నా కన్నీళ్ళతో నీ పాదాలను కడిగి తృప్తి చెందే భాగ్యం కలిగినందుకు పొంగిపోతున్నాను. కన్నీళ్ళున్నది ఇందుకని ఇప్పుడే తెలిసింది".

బోధలు లభించిన వానిని బాధలు ముట్టలేవు. అవగాహన లేనివాడు సాధనలో చరించలేడు. వెలుగు నాశించిన వారంతా వెలుగును దర్శించే ముందు వెతలను దర్శించిన వారే. స్పృశించిన వారే.

దూరప్రయాణము చేయువ్యక్తి శక్తివంతుడై యుండాలి. ధైర్యశాలియై ఉండాలి. చీపురుపుల్లతో త్రాచుపామును చంపాలనుకోవడం అవివేకం. దుడ్డుకర్రతో కొట్టడమే దొడ్డబుద్ధి గలవాని లక్షణం.

పిరికివానికి ముక్తి లేదు అన్నది కఠోపనిషత్తు. ఋషి పుత్రులారా! పిరికితనాన్ని పారద్రోలండి. సాధనలో ఉద్యమించండి. బుద్ధిలో ఉత్సాహముంటే బాట కష్టమనిపించదు. మాట నమ్మిన వారికి మూట అందకపోదు. కోట చిక్కక పోదు.

పాట నాలపిస్తూ బాటలో చరిస్తే వేట ఆగినట్లే, వెలుగు చిక్కినట్లే, చేజిక్కినట్లే. ప్రయత్నించండి.

ప్రణవప్రేమలతో
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 33

ఆత్మస్వరూపా!

హరిః ఓం .... ఓం నమో భగవతే వాసుదేవాయ.

వందనములు.

"నిందాస్తుతులు" నిజజీవితానికి నిత్యాభరణాలు. నింద తెలియని బ్రతుకులో అందం లేదు. కీర్తిగల వానికి స్తుతులు చుట్టాలే. నిజస్తుతి వాస్తవానికి వీనులకు విందే. కానీ అసత్యపు పొగడ్తలు విందులుగా గోచరించినా అవి వేషాలే.

వంచనకు అలవాటు పడిన వారు ఇతరులలో మంచిని చూడలేరు. మంచిచెడులు మనిషి మనస్సుకు తేలికగా దొరకవు. మంచివారిలో కొంత చెడు లేకపోలేదు. చెడ్డవారిలో కొంత మంచి ఉండకపోదు.

నీలో మంచిని అందరూ చూడలేరు. మంచివాడే మంచిని చూడగలడు. కొందరు మంచిని గ్రహించలేక పోయినా చెడును మాత్రం గ్రహించరు. మరికొందరు చెడును గ్రహించడమే జీవితధ్యేయంగా పెట్టుకొని యుంటారు.

చెడ్డవారు చెడినవారే గనుక చెడుమాటలు, చెడు చేష్టలకే పరిమితులు. వారికి పెద్ద, చిన్న తారతమ్యము తెలియదు. పరులను బాధించడములో వారికి పరమాన్నం లభించినట్లు ఉంటుంది.

నీవు సాధకుడవు. నిందలను చూసి కృంగిపోకూడదు. వందనీయులను కూడా నిందలు వదలవు. గొర్రెలమందకు గౌరవ మేమిటో తెలియదు.

నీవు పెరుగుతున్నావంటే నీతో పాటు, నీ చుట్టూ నిందలు పెరుగుతుంటాయి. అది సహజం. వాటి మధ్య నీవు చెదిరిపోతేనే అసహజం. నిందలను సవాళ్ళుగా స్వీకరించాలి. నిన్ను పెంచేందుకే నిందలు నిలిచి ఉన్నాయి.

తన శిష్యుల సహాయంతో బుద్ధుడు ఒక స్త్రీని హత్యచేసినట్లు ఉదంతులు వ్యాప్తి చేశారు కొందరు నీచులు. చాలామంది వ్యతిరేకులు బుద్ధుని విమర్శించారు.

శిష్యుడైన ఆనందుడు బుద్ధుని సమీపించి, "మనం ఈ ఊరు వదలి మరొక ఊరికి వెళ్దాము" అన్నాడు.

"మరి ఆ ఊరు వారుకూడా నిందిస్తే ఏం చేద్దాం?" అన్నాడు గౌతమబుద్ధుడు.

"ఇంకొక ఊరికి వెళ్దాం" అన్నాడు ఆనందుడు.

"ఆనందా! అయితే మనం ఉండేందుకు ఈ దేశంలో స్థలం దొరకదు. ఓర్పుతో జీవించు. ఈ నిందలు కాలంలో కరిగిపోతాయి" అంటాడు బుద్ధుడు.

ఈ ప్రపంచంలో దోషము లేని వారుండరు. మన దోషాలు మనకు గోచరించవు. అందుచేత అవి ఆంతర్యంలో పటిష్ఠంగా స్థిరపడి ఉంటాయి. ఇతరులు మనల్ని దూషించినపుడు మనలోని దోషాలేవో మనకు తెలిసివస్తాయి. వెంటనే కాలికి అంటిన బురదను కడిగినట్లు దోషాలను నివృత్తి చేసికోవచ్చు.

ఒకవేళ నిర్దోషులైన మనల్ని ఇతరులు దూషిస్తే ఎలా? అనే శంక నీకు రావచ్చు. అప్పుడూ మంచిదే. లేని దోషాలను ఇతరులు మనకు చూపడం వల్ల మున్ముందు అవి రాకుండా మనం జాగ్రత్తపడే అవకాశం వారు కల్పించారు. కనుక వారు అభినందనీయులే.

క్షమను వృద్ధి చేసేందుకు క్షామం వస్తుంది. ఆపదలు అభివృద్ధికి పునాదులు. బాధలే బ్రతుకును తీర్చిదిద్దే బోధలు. ఈనాటి వెతలే ఓనాటి వెలుగుల తోరణాలు. ప్రతికూల పరిస్థితులను కూడా అవగాహనతో అనుకూలంగా మార్చుకొనువారే ధన్యజీవులు.

తాత్వికుడైన సోక్రటీస్ మహాశయుని భార్య గయ్యాళి. భర్తను తిట్టడము ఆమె నిత్యకృత్యాలలో ముఖ్యకార్యము. ఒకరోజు ఆమెకు ఆరోగ్యం బాగలేక భర్తను తిట్టడమనే కార్యక్రమాన్ని సాగించలేక పోయింది.

సోక్రటీస్ స్నేహితుల మధ్య ఉన్నాడు. సోక్రటీస్ విషాదముగా గోచరిస్తున్నందుకు కారణ మేమిటని స్నేహితులు ప్రశ్నించారు. అనారోగ్య కారణంగా తనను భార్య తిట్టలేదనియు, తన బాధకు కారణమదియే ననియు సోక్రటీస్ చెబుతాడు.

"దానికి సంతోషించక బాధపడతా వెందుకు?" అన్నారు స్నేహితులు.

"ఆమె తిడుతూ ఉంటే నేను సహనాన్ని వృద్ధిచేసికొనే అవకాశం కలుగుతూ ఉండేది. ఈరోజు నాకు ఆభాగ్యం కలుగలేదు. అందుకే దుఃఖిస్తున్నాను" అంటాడు సోక్రటీస్.

ఇవే బ్రతుకులో ప్రతిబింబించదగిన నిత్యసత్యాలు. బాహ్యపరిస్థితులు ప్రతికూలమైనా వాటిని ఆంతర్యంలో అనుకూలంగా మలచుకో గలవారే బ్రతుకు విలువ తెలిసినవారు. వారే ప్రపంచంలో బలవంతులు.

"పరిస్థితులు బలహీనుల్ని పరిపాలిస్తాయి. బలవంతులకు పనిముట్లుగా సహకరిస్తాయి." అంటాడు ఆలివర్ గోల్డ్‌స్మిత్.

అనడం-వినడం-విస్మరించడం గాకుండా బ్రతుకులో వాటిని కనడం మన ప్రధాన కర్తవ్యం కావాలి. ఇదే సాధన. రోదనను, వేదనను రూపుమాపే ఆరాధన.

ప్రణవప్రేమలతో

మీ

స్వామి సుందర చైతన్యానంద

లేఖ 34

ఆత్మస్వరూపా!

హరిః ఓం ..... ఓం నమో భగవతే వాసుదేవాయ

వందనములు.

జీవితమొక భయంకర సమరము. ఈ సంగ్రామము ఈనాడు ప్రారంభమైనది కాదు. అనేక వేల జన్మల నుండి సాగుచున్నదియే. మనలోని భక్తిభావములకు, విషయపిపాసకు మధ్య అనాదిగా యుద్ధము జరుగుచునే యున్నది. భక్తి జయించిన నాడే బ్రతుకు ధన్యమగును. భగవత్కృప లభించినప్పుడే భక్తికి విజయము లభించును.

భగవంతుడు దయాసాగరుడు. ఆయన సర్వవ్యాపి. ఇది నిజమో! కాదో! అనుభవములో దర్శించుటయే సాధన.

ఆహారమును ఆరగించే పని నీది. దానిని జీర్ణము చేయు పని భగవంతునిది. **"పచామ్యన్నం చతుర్విధం"** నీవు భుజించే నాలుగు రకములైన పదార్థములను జఠరాగ్ని రూపంలో తానే పచనము చేయుచున్నట్లు పరమాత్మ గీతలో తెలిపి యున్నాడు.

అలాగే జీవిత సమరంలో పోరాడే పని నీది. గెలిపించే పని అతనిది. గెలుపు నా మీదే ఆధారపడి యున్నదని నీవు భావించుటయే కొన్ని వేల జన్మలలో నీ ఓటమికి కారణమైంది. గెలిపించే వాని వైభవమును స్మరిస్తూ పోరాడటం అలవరచుకో. విజయము నిన్ను వరిస్తుంది.

మిత్రమా! గతములో నీ విజయానికి సహకరించిన వారంతా నిన్ను వెన్నుపోటు పొడిచిన వారే. దగా చేసినవారే. దయామయుడైన జగన్నాథుని విస్మరించి దగాకోరులను, మోసగాండ్రులను నమ్మి జీవితమునే వమ్ము చేసికొనినావు. మించిపోయింది లేదు. ఇప్పుడైనా ప్రయత్నించి చూడు. పరమాత్మను పూర్ణ హృదయంతో విశ్వసించు. విజయభేరిని మ్రోగించగలవు.

"నేను చాలా కాలంగా సాధన చేయుచున్నాను. భగవత్కృప నాకు లభించలేదు. నా బాధలు తీరడం లేదు. కష్టాలు కరగడం లేదు" అని నీవు వాపోవుట శుద్ధ మూర్ఖత్వము. నీవు ఈనాడు చేయు సాధనలు నీకు గోచరిస్తున్నాయి గాని అనేక జన్మలలో నీవు ఆచరించిన పాపాలు నీకు తెలియుట లేదు. బాధలు మిగిలున్నాయంటే ఇంకా సాధన చేయవలసి యున్నదని భావము. శత్రుశేషము మిగిలియున్నంత వరకు నీకు విజయము లభించలేదనియే భావము.

నీ వెంతగా శ్రమించినను, ఆర్జించినను, అన్యుల నుండి సాయమును పొందినను నీవు సుఖించలేవు. నీ దోషములను తొలగించువాడు, నీకు తోషమును ప్రసాదించువాడు భగవాను డొక్కడే.

పరమాత్మను విశ్వసించుట యనునది లోకులు భావించినంత తేలికైన పనికాదు. విశ్వాసము విలువ మాటల కందనిది. అదొక కవచధారణ వంటిది. నిర్భయమును, నిర్మలత్వమును ప్రసాదించునది భగవంతునిపై నీకున్న విశ్వాసమే.

అనంత దుఃఖసాగరములో మునిగిపోతున్న సోదరా! నామాట విను. నీ రాన్నంతా భగవానునికి అర్పించు. జగన్నాథుడైన పరమాత్మను పూర్ణవిశ్వాసముతో శ్రయించు. విశ్వామిత్రుని యాగశాల ముందు కోదండమును ధరించి నిలిచినట్లు జీవితంలో రాముడు ప్రవేశిస్తాడు. భగవంతునిపై భారము నుంచి చరించడమంటే కృష్ణుని రథములో కూర్చోవడమని భావము.

సాధనలో రెండు మెట్లు ప్రధానముగా తెలుస్తున్నాయి. ఒకటి భగవంతునిని ందించే పై మెట్టు. రెండవది భగవచ్చరణారవిందములను శాశ్వతముగా దూరం కేసే క్రిందిమెట్టు.

"రక్షస్యతీతి విశ్వాసః" 'భగవానుడు నన్ను రక్షించును' అనెడివిశ్వాసము పైమెట్టుకాగా, పరమాత్మ నిజముగా నన్ను రక్షించునా? అనెడి సంశయము క్రింది మెట్టుగా తెలియుచున్నది.

పైమెట్టుపై కాలిడినవారు పైనున్న భారమును తొలగించుకొని సుఖిస్తారు. క్రిందిమెట్టుపై కాలిడినవారు క్రిందనున్న బరువును తలపై కెక్కించుకొని మోయలేక దుఃఖిస్తుంటారు.

నీకీ ప్రపంచములో కీర్తిప్రతిష్ఠ లుండవచ్చు. ధనముండవచ్చు. కానీ ఇవన్నియు నీ దుఃఖమును పోగొట్టలేనిచో అవి వుండి ఏమి ప్రయోజనము? నీ దుఃఖమును పోగొట్టువాడు, నీకు అనంతసుఖమును ప్రసాదించువాడు పరమాత్మ ఒక్కడే.

నమ్మి చెడినవారు లేరు. నమ్మక సుఖించినవారూ లేరు. ప్రారబ్ధాలు ప్రబల శత్రువులై నిలిచియున్నాయి. పురుషార్థమునే మిత్రుడుగా చేసికొని, అవిశ్రాంత పోరాటమును సాగించి, భగవత్కృపతో విజయమును సాధించాలి. ఇదొక్కటియే సాధకుల కర్తవ్యము.

సాధకా!సాగిపో

అనంత యాత్రలో

అచ్యుతుని పాదాల చెంత

విశ్రమించే

మీ

స్వామి సుందరచైతన్యానంద

లేఖ 35

ఆత్మస్వరూపా!

హరిః ఓం....ఓం నమో నారాయణాయ
వందనములు.

కర్మ చేయకుండా ఎవరూ కూడా ఉండలేరు. అగని కర్మలను సాగిపోనీ. కానీ కర్మను ఆరంభించే ముందు రెండు విషయాలను స్మృతికి తెచ్చుకో.

1. నేను చేసే ఈ కర్మ వల్ల నాకేమైనా హాని జరుగుతుందా?

2. ఇతరుల కేమైనా హాని జరుగుతుందా? లేక ఇద్దరికీ జరుగుతుందా?

ఈ ఆలోచన కర్మకు ముందుగా మనసులో కదిలితే చాలు. నీవు ఏ కర్మ చేసినా మంగళకరమే అవుతుంది. నీకు హాని లేని, ఇతరులకు హాని చేయని కర్మ ఎప్పుడూ సుఖాన్నే పంచుతుంది.

ప్రేమహృదయాలు పరులను బాధించలేవు. పరులను హింసించే మనసులో పాషాణం ఉందని భావము.

దుఃఖమనేది ఎవరికైనా దుర్భరమే. సుఖం అందరికీ వాంఛనీయమే. భరించలేని దుఃఖాన్ని దురవగాహనతో నీవు కొనితెచ్చుకోకు. అలాగే నీకు దుర్భరమైన దుఃఖం పరులకు కూడా దుర్భరమే అని మరచిపోకు.

ప్రేమ నిండిన హృదిలో పగలుండవు. ద్వేషాలుండవు. దోషాలుండవు. మోసాలుండవు. తల్లి ఎలాగైతే తన ప్రాణాన్నైనా త్యజించి బిడ్డను కాపాడుతుందో సాధకుడవైన నీవు అంతగా శ్రమించి ప్రేమజీవనాన్ని తయారు చేసుకోవాలి.

ప్రేమగా జీవించడం పరమాత్మను తృప్తి పరచుటకు కాదు. అనుగ్రహాన్ని సంపాదించేందుకు కాదు. పరులను ప్రేమించడంలో దయ, సానుభూతి చోటు చేసుకోవాలి. ఎవరైతే ప్రేమజీవులై ఉంటారో వారు, వస్తువును భూమి ఆకర్షించునట్లు పరమాత్మను హృదయంలోకి ఆకర్షిస్తారు.

మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 36

ఆత్మస్వరూపా!

హరిః ఓం........ఓం నమో నారాయణాయ
వందనములు

స్వల్పమైన, అల్పమైన సుఖాల్ని త్యాగం చేసినపుడే జీవితంలో శ్రేష్ఠమైన ఆనంద శిఖరాలను చేరగలం.

ఈ ప్రపంచంలో ఎవరయినా మరొకరి కొరకు వేచియున్నట్లు నీవు భ్రమిస్తున్నావా? జాగ్రత్త! ఇది చాలా ప్రమాదకరమైన విషయం. జీవితం ఒంటరి ప్రయాణము. ఇక్కడ ఎవరి ఆటలు వాళ్ళు ఆడుతున్నారు. ఎవరి మార్గాన వాళ్ళు వెళ్తున్నారు.

కాలం ఎవ్వరినీ కనికరించదు. కాలం నమిలి, చప్పరించి మింగని వస్తువు ప్రపంచంలో లేదు. జీవితం కర్పూరం లాగా కంటిముందే కరిగిపోతూ వుంది. ఉన్న వాస్తవాన్ని చూడు. లేని అంధత్వాన్ని ఆపాదించుకోవడం దురదృష్టకరం..

అదృష్టం లేదని, కలసిరాలేదని విలపించడం వెర్రితనం. అదృష్టదేవత ఎలా ఉంటుందో, ఎక్కడుంటుందో బహుశ నీకు తెలియక పోవచ్చు. ఆమెను నేను చూశాను. చాలాసార్లు కరచాలనం చేశాను. ఆమె గుట్టంతా నాకు తెలిసిపోయింది.

ఆశించిన వాణ్ణి మోసం చేస్తుంది. నిరాకరించిన వాడి నీడలో అంతిమశ్వాస వరకు పడివుంటుంది. ఎవరైనా చక్రవర్తిని ఆశ్రయిస్తారు కాని బిచ్చగాడ్ని, బానిసను ఎవరు ఆశ్రయిస్తారు?

ఎవరీ ప్రపంచంలో చక్రవర్తి? బ్రతుకు తీరు తెలిసి తేరుకున్నవాడే. తీరం చేరిన వాడే. అట్టివాడు బిచ్చగాని వలె స్వల్పమైన సుఖాల వెంట పరుగెత్తడు. బానిస వలె అల్పమైన విషయాల వెంట పడడు.

కళ్ళు తెరచి చూడు. రోజంతా నీచుట్టూ ఏమి జరుగుతూ వుందో, నీలో ఏమి జరుగుతూ వుందో

పని, పని, పని. .... పరుగు, పరుగు, పరుగు.

ఎంత శ్రమ? ఎంత ఆలోచన? ఎంత కాలం? ఇదంతా దేనికొరకు?

చేతులు నోటి దగ్గరకు చేరేందుకు, రెప్పలు కంటిపై వాలేందుకు కూడ సమయం లేకుండా శ్రమిస్తున్నావు. ఇదంతా నీవు ఆలోచించడం లేదు కనుక నీకు తెలియకపోవచ్చు.

కానీ, ఒక్క విషయం - కాదు, సత్యం.....ఒక్క సత్యం నీకు బాగా తెలుసు. ఈ డబ్బు, ఈ సంపాదన, ఇలా శ్రమించి గడించినదంతా ఒకరోజు శిక్కడే ముట్టచెప్పి వెళ్ళాలి.

మరి ఈ శ్రమంతా దేనికి పడ్డట్లు? శ్రమించి ఏమి సాధించినట్లు?

పానీ కే రా బుద్బుద ఇస్ మానుష కీ జాత్
దేఖత హీ ఛిప జాయగే జ్యోం తారా ప్రభాత్!

"ఈ దేహాలు నీటిబుడగల వంటివి. నిలకడ లేనివి. వీటికొరకు పరితపించడంతోనే బ్రతుకంతా గడిచిపోతోంది. తెల్లవారితే తారలుంటాయా! కాలంలో ఈ దేహాల పరిస్థితి కూడా అంతే" అంటాడు కబీర్‌దాస్.

మిత్రులారా! శ్రమ పడవచ్చు. ఆలోచనలు చేయవచ్చు. కాలం వెచ్చించవచ్చు. కానీ దేనికొరకు? ఇక్కడే మన విచక్షణ పనిచేయాలి. మాసిపోని, మారిపోని సుఖం కొరకు మనం శ్రమించలేమా? పారిపోని, ఆరిపోని దీపాన్ని వెలిగించుకొనుటకు పరిశ్రమించలేమా?

కరదీపికలా ముందు నడచేదాన్ని పారేసి, చీకటిలో వెనుకబడి నశించేదాన్ని ప్రేమిస్తావా! పట్టుకుంటావా!

చేసింది, చూసింది మరచిపో, భవిష్యత్తుకు బాటను నిర్మించుకో. ఎప్పుడైనా జీవితం పోరాటమే. ధీరత్వానికి విజయం తప్పదు. పిరికితనానికి ఎప్పుడైనా పతనమే.

కష్టాలకు నేను జడవను. అవి నాకన్నా వేరుగా ఉంటే కదా నేను జడవాలి? అవి నా నేస్తాలు. నన్ను అనుసరించే సేవకులు.

ప్రణవప్రేమలతో
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 37

ఆత్మస్వరూపా!

హరిః ఓం ....ఓం నమో భగవతే వాసుదేవాయ
"అణుకువ - అధికారం"

ఈ రెండు పదాలు అందరికీ తెలిసిన జంటపదాలు. వంటబట్టని ఈ జంట-బ్రతుకు వంటనే పాడుచేస్తుంది.

నే చెప్పేదే వినాలి. చేయాలి. ఇది అధికారం.

వారు చెప్పేదీ విందాం. వీలుంటే చేద్దాం. ఇది అణుకువ.

"నా మాటే వేదం" అని వెర్రితనంతో విజృంభించడం "అధికారం" పట్టించుకున్న పైత్యం. "సునాదం సర్వులకు సొత్తు" అని సౌజన్యంతో సరళంగా ప్రేమించడం "అణుకువ" అలవరచుకున్న సుగుణం.

అధికారం చలాయించడం అందరికీ ఇష్టం. అణుకువతో జీవించడం కొందరికి కష్టం. చెప్పాలనే దురదే గాని వినాలనే సరదా ఉండదు.

మొదట విధేయత నేర్చుకోవాలి. వినయంతో వినడం అలవరచుకోవాలి. ఆ తరువాత ఆదేశించే హక్కు దానంతటదే వస్తుంది.

సేవకచిత్తంతో జీవించువాడు ప్రభుబుద్ధిని సంతరించుకుంటాడు.

"ప్రభుజీ తుమ్ స్వామీ హమ్ దాసా"

"ప్రభూ! నీవు స్వామివి. నేను దాసుణ్ణి" అంటాడు రైదాసు.

ఆజ్ఞలిచ్చేవాడు ప్రభువు. ఆచరించేవాడు సేవకుడు.

ఈ భావంతో భక్తుడు భగవంతుని సమీపిస్తాడు. ఆ తరువాత భక్తుడు సంకల్పించినదంతా పరమాత్మ చేసిపెట్టూ పోతాడు.

విధేయతలో, ప్రేమలో, భక్తిలో అంత శక్తి ఉంది.

భార్య భర్త చెప్పినట్లు విని భర్తను తృప్తిపరుస్తుంది. ఆ తరువాత భార్య ఎలా చెప్తే భర్త అలా చేస్తాడు.

గురువును తృప్తిపరచేలా శిష్యుడు జీవిస్తాడు. ఆ తరువాత శిష్యుని మాటను గురువు గుర్తిస్తాడు.

అధికారంతో వ్యక్తుల్ని లొంగదీసుకోవడం పశుత్వం.

ప్రేమతో వ్యక్తుల్ని లోబరచుకోవడం మానవత్వం. కాదు,.......దైవత్వం.

శిలలతో, కంటకాలతో కూడిన అధికార బాటలో వ్యక్తి సుఖించలేడు. విశాలాకాశంలో ఆటంక మెరుగని అణకువమార్గంలో మనిషి ఆనందిస్తాడు.

ఇంకా బాగా తెలియాలంటే - ఇటు తిరగాలి.

మన అణకువను పాడుచేసిందెవరు? మన నమ్రతను కాలరాచిందెవరు? ఎదుటవాని అధికారం మన అణకువను పాడుచేస్తుంది. ఎదుటివ్యక్తి దౌర్జన్యం మన సౌజన్యాన్ని మంటకలుపుతుంది, అనేదే కదూ నీ ఆలోచన!

ఈ ప్రపంచంలో ఎందరో జీవిస్తున్నారు. ఎవరి ఆటలు వారు ఆడుతున్నారు. ఆ వికారాల్ని చూసి మన ఆకారాల్ని ఎందుకు పోగొట్టుకోవాలి? విచిత్ర ప్రపంచంలో వికృతాలు కూడా వైచిత్ర్యాలే.

బహువికృతంగా కన్పించే దారుణమైన రూపాన్ని చిత్రకారుడు గీసాడు. అది చాలా భయంకరంగా ఉంది. ఉండనీ. ఏమైంది? అది బొమ్మని నీకు తెలుసు. అనిత్యమని తెలుసు. బొమ్మ దారుణంగా గోచరిస్తున్నా చిత్రకారుని కౌశల్యానికి మనం ముగ్ధులవుతున్నామా? లేదా!

భావనాపటిమ ఉండాలే గాని భగవంతుడు బహువిధాలుగా గోచరిస్తాడు. భిన్నప్రవృత్తులతో తైతక్కలాడే వ్యక్తులున్న ఈ లోకంలో అభిన్నుడైన అచ్యుతుని దర్శించే అలవాటు చేసుకోవాలి. దానికి అణకువయే రాజమార్గం. రాణించే మార్గం. రాజిల్లే మార్గం. విరాజిల్లే మార్గం.

ప్రతిశ్వాస మీకొరకే
వినియోగ పడాలనే
చిత్తశుద్ధితో శ్రమిస్తున్న
మీ
స్వామి సుందర చైతన్యానంద

లేఖ 38

ఆత్మబంధువులారా!

హరిః ఓం..............ఓం నమో భగవతే వాసుదేవాయ.

మనది చర్చల వేదాంతం కాదు. చేతల వేదాంతం. అనితరసాధ్యమైన అమోఘకార్యాలను సాధించే భారాన్ని పరమాత్మ మనకు అప్పగించాడు. ఆనందంతో ముందు కురకడమే తక్షణకర్తవ్యం.

గతాన్ని విస్మరించడం భవిష్యత్తును పాడుచేసుకోవడమే. గతాన్ని ద్వేషిస్తే భవిష్యత్తుకు రూపం రాదు. భూతభవిష్యత్తుల్ని వర్తమానం లోకి లాగడమే ఉత్తముల కర్తవ్యం. కాలానికి అతీతులై జీవించడం విజ్ఞుల వైభవం.

మంచిచెడుల మిశ్రమమే ప్రపంచం. జీవితము కూడా. ఎప్పుడూ తనకు మంచే జరగాలని మనిషి కోరుకుంటాడు. ఈ ప్రపంచంలో చెడు కూడా వినియోగంలో ఉంది. మంచే జరగాలి అనుకోవడం అంత మంచిది కాదు.

ఏది మంచో? ఏది చెడో? ఏది ధర్మమో? ఏది అధర్మమో?.....వర్షం ఎంతో మేలు చేస్తుంది. అదే వర్షం పంటను పాడుచేయడమే గాకుండా, ప్రాణాల్ని కూడా తీసేస్తుంది కొన్ని సమయాల్లో.

సోదరుడని కూడా భావించక దుష్టుడైన రావణుణ్ణి వదలి రాముని వద్దకు వచ్చాడు విభీషణుడు. రాముని గెలుపుకు కారణమయ్యాడు. ఇది రామాయణం.

సజ్జనులైన పాండవులను వదలి దుష్టుడైన దుర్యోధనుని ప్రక్క నిలబడి యుద్ధం చేశాడు భీష్ముడు. దుర్యోధనుని ఓటమిని చూశాడు. ఇది మహాభారతం.

భీష్మ విభీషణులు ఇద్దరూ ధర్మాత్ములుగనే స్తవనీయు లయ్యారు. ధర్మాధర్మాల విశ్లేషణము అంత సులభమైన విషయం కాదు. ద్వంద్వాలలో అందాలను నిలుపుకోవడం కష్టం. అవి వెలుగునీడలు. బ్రతుకుకు రెండు అంచులు. పరస్పరాధీనాలు. కాల నర్తకి ప్రదర్శించే విచిత్ర నాట్యభంగిమలు.

The white head and the black tail of the mystic dark

కారుచీకట్ల కాలభుజంగానికి తల తెలుపు - తోక నలుపు. ఇవే దివారాత్రాలు అంటాడు అరవిందయోగి.

ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతః స పన్థాః

"ధర్మము యొక్క స్వరూపము నిగూఢమైనది. మహాత్ములు నడచిన బాటయే మిగిలిన వారికి శ్రీరామరక్ష" అన్నది భారతము.

కాలాన్ని వాడుకోవాలి కాని కాలంతో ఆడుకోకూడదు. వాడుకలోనే ఉంది వేడుక.

కాలమనేది అంతుపట్టే విషయం కాదు. అదొక భయంకర ప్రవాహం. సుడులు తిరుగుతూ పరుగులిడే కాలప్రవాహంలో ఆశల దీపాలు ఆరిపోయేవే. బాంధవ్య నౌకలు పారిపోయేవే.

అస్మిన్ మహా మోహమయే కటాహే
సూర్యాగ్నినా రాత్రి దివేన్ధనేన
మాసర్తు దర్వీ పరిఘట్ట నేన
భూతాని కాలః పచతీతి వార్తా!

"ఈ ప్రపంచము మోహంతో నిండిన పెద్ద బాన. దీనికి రాత్రిపూట అగ్ని, పగటిపూట సూర్యుడు నిప్పుగా ఉన్నారు. మాసాలు, ఋతువులు అనే తెడ్డుతో కలియబెడుతూ కాలపురుషుడు జీవులను వండుతున్నాడు. ఇదియే తాజా వార్త" అన్నది మహాభారతము.

క్షణంలో గండం. నిముషంలో మరణం ఇదీ ప్రపంచంలో చదరంగం. క్షణం కూడా వృథా గాకుండా సన్మార్గంలో చరించడమే మన తక్షణకర్తవ్యం.

సత్యమేవ జయతే.

సత్యద్రష్టల మార్గంలో
మీ
స్వామి సుందర చైతన్యానంద